PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 346 | విజయవాడ, ఆదివారం 16 జులై 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 16 July 2023 | Rs

పంచాయతీలకు యూనిట్‌కు రూ.9 వసూలు

- కమర్షియల్ వినియోగం లెక్కగడుతున్న ట్రాన్స్‌కో
- పైగా వడ్డీలు, చక్రవడ్డీలు, ట్రూఅప్, అడ్జస్ట్‌మెంట్ బాదుడు

లోపలి పేజీలో..



వింబుల్డన్ నయా ఛాంపియన్

వోంద్రుసోవా

- టైటిల్ నెగ్గిన తొలి అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా రికార్డు
- గాయంతోనే ఫైనల్లో ఓడా: జబీర్

లోపలి పేజీలో..

యుసిసిపై సంఘటిత పోరు

ఎన్నికల వేళ కాషాయ కుతంత్రాలు

మత పరంగా ప్రజల్లో చీలిక తేవడమే బిజెపి లక్ష్యం

కొజికోడ్ జాతీయ సెమినార్‌ను ప్రారంభిస్తూ ఏచూరి

కొజికోడ్ : అడుగడుగునా జీవన వైవిధ్యంతో వికసిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న భారతావనిలో దేశ ప్రజలందరికీ వారి సంస్కృతీ, సాంప్రదాయాలను గౌరవించకుండా ఒకే కోడ్ అమల్జేస్తామంటే అది విచ్ఛిన్నానికి దారితీస్తుందని, ప్రజల మధ్య చీలికలు తీసుకొస్తుందని సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి హెచ్చరించారు. తొమ్మిదేళ్లు నిద్ర నటించి ఇప్పుడు ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) పేరుతో బిజెపి చేస్తున్న కుతంత్రాలను సంఘటిత పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. యుసిసికి వ్యతిరేకంగా సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం కొజికోడ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌ను ఏచూరి ప్రారంభించారు. లౌకిక వాదులు, రాజ్యాంగ నిపుణులు, వివిధ సామాజిక తరగతుల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సెమినార్‌నుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ .. మత పరంగా సమాజాన్ని చీల్చే లక్ష్యంతోనే బిజెపి ప్రభుత్వం యుసిసిని ఏకపక్షంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశ వైవిధ్యతను పరిరక్షించాలన్నారు. ఉమ్మడి పౌర స్మృతిని వ్యతిరేకించాలన్నదే సిపిఎం విధానమని స్పష్టం చేశారు. దీన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇతర ఎజెండాలు వున్నాయని, ఇది పక్కా రాజకీయ ప్రణాళిక అని అన్నారు. దేశ బహుళత్వాన్ని పరిరక్షించడానికే ఈ సదస్సు అని



శనివారం కొజికోడ్ జాతీయ సెమినార్‌లో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

పేర్కొన్నారు. వివిధ సామాజిక తరగతులు వారికి సంబంధించిన చట్టాల్లో తప్పులుంటే సరిదిద్దుకుంటూ ముందుకెళ్లాలని, అంతే కానీ లోపాలున్నాయనే పేరుతో అన్ని సామాజిక తరగతులపైనా ఒకే కోడ్ బలవంతంగా రుద్దడం సరికాదని ఏచూరి నొక్కి చెప్పారు.

వివక్ష పూరిత చట్టాలను సరిదిద్దాల్సిందే..

ఏకరూపత అంటే సమానత్వం కాదని ఆయన వ్యాఖ్యానించారు. వివక్షాపూరితంగా వున్న చట్టాలను సరిదిద్దాల్సిన అవసరం వుందని అన్నారు. యుసిసిని ప్రతి ఒక్కరిపై బలవంతంగా రుద్దడానికి బదులుగా మొత్తంగా ఆయా కమ్యూనిటీతో సవివరంగా సంప్రదింపులు జరిపిన తర్వాతనే అమలు చేయాల్సి వుందన్నారు. 'ఒకే సివిల్ కోడ్ విధించాల్సిన అంశం కాదు, మత పరమైన విభజనే దీని లక్ష్యం. సమాజాన్ని మతాల వారీగా చీల్చడానికి ఇది ఆరంభం. సమానత్వం కోసం సకాలంలో మార్పులు తీసుకురావాల్సింది ఆయా గ్రూపులే. ఎన్నికల ముందు బిజెపి ఎత్తుగడ ఇది. ప్రపంచం వైవిధ్యం కోసం ప్రయత్నిస్తుండగా, భారతదేశం ఏకీకరణ కోసం పాటు పడుతోంది. ఏకపక్షంగా ఉమ్మడి పౌర స్మృతిని విధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని ఏచూరి పేర్కొన్నారు. సమానత్వం అంటే ఏకీకరణ కాదని అన్నారు. ఈ క్రమంలో ప్రతి మిగతా 3లో

గుజరాత్ హైకోర్టు తీర్పుపై

సుప్రీంకోర్టులో రాహుల్ సవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో




పరువునష్టానికి సంబంధించిన ఒక కేసులో దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు నిరాకరిస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించా రు. 2019 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడుతూ 'దొంగలందరికీ మోడీ ఇంటిపేరే ఎందుకు ఉంటోందో?' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ వ్యాఖ్యల ద్వారా రాహుల్ తమ పరువుకు భంగం కలిగించారంటూ బిజెపి ఎమ్మెల్యే పూర్ణేష్ మోడీ పరువు నష్టం దావా వేయగా.. దానిపై విచారణ చేపట్టిన సూరత్ కోర్టు మార్చి 23న రాహుల్‌ను దోషిగా తేల్చి రెండేళ్ల పాటు జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. సూరత్ కోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలంటూ రాహుల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. దోష నిర్ధారణపై నిలిపివేత ఉత్తర్వులు ఇచ్చేందుకు గుజరాత్ హైకోర్టు గత శుక్రవారం నాడు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో రాహుల్ శనివారం నాడు పిటిషన్ దాఖలు చేశారు.

సూరత్ కోర్టు తీర్పు వెలువడిన మరుసటి రోజు మార్చి 24న రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటుపడిన సంగతి తెలిసిందే. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 బలమైన సెక్షన్ 8 ప్రకారం ఆయనపై వేటువేసినట్లు లోక్‌సభ కార్యదర్శి అప్పట్లో ప్రకటించారు. తక్షణం వేటు అమలులోకి వస్తుందని ప్రకటించారు.

నవరత్నాలు ఆడిట్‌కు దూరం!

- దృష్టి సారించిన ఎజి కార్యాలయం
- వివరాలివ్వాలంటూ ప్రభుత్వానికి లేఖలు
- త్వరలో సచివాలయానికి అధికారులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు ఏళ్ల తరబడి ఆడిట్ ప్రక్రియకు దూరంగా ఉన్నట్లు సమాచారం. పెద్ద మొత్తంలో నిధులు, లబ్ధిదారులతో ముడిపడి ఉన్న ఈ పథకాలు ఇంతవరకు ఆడిట్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం ఈ విషయంపై దృష్టి సారించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం నవరత్నాల పథకాలకు సంబంధించి పూర్తి వివరాలు పంపాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసింది. ఆర్థికశాఖతో పాటు ఆ పథకాలను అమలు చేసే వివిధ శాఖల ఉన్నతాధికారులకూడా ఈ మేరకే లేఖలు అందినట్లు సమాచారం. దీంతో పాటు నవరత్నాల పథకాలను పూర్తిస్థాయిలో ఆడిట్ చేయడానికి కూడా ఎజి కార్యాలయం సిద్ధమౌతోంది. దీనిలో భాగంగానే త్వరలో రాష్ట్ర సచివాలయానికి కూడా ఎజి కార్యాలయ అధికారులు స్వయంగా వచ్చి, తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని తెలిసింది. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట పలు పథకాలను అమలులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందుతున్నాయి. దాదాపుగా నాలుగేళ్ల నుండి ఈ పథకాలు ఉన్నా ఒక్క దానికి కూడా ఇప్పటివరకు ఆడిట్ జరగలేదని తెలిసింది. సంబంధిత శాఖల అధికారులు ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిఉన్నా వారు పట్టించుకోలేదని సమాచారం. ఇతర శాఖల అధికారులు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలకు ముందే ఆడిట్ ప్రక్రియను పూర్తి చేయాల్సిఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోలేదని, ఉన్నతస్థాయిలోనూ ఈ విషయాన్ని విస్మరించారని అంటున్నారు. ఆడిట్ నిబంధనల ప్రకారం ఇది తీవ్రమైన లోపంగా వారు చెబుతున్నారు. దీంతో ప్రధాన అక్కౌంటెంట్ కార్యాలయమే రంగంలోకి దిగినట్లు కనిపిస్తోంది. అందుకే ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ (పిఎజి) ఆడిట్‌పై అన్ని శాఖలకు సమాచారాన్ని అందించినట్లు తెలుస్తోంది. జగనన్న విద్యా కానుక, వైఎస్ఆర్ గోరుముద్ద, వైఎస్ఆర్ గృహవసతి, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ పథకాలతోపాటు కేంద్ర నిధులతో అమలు చేసే స్వచ్ఛ భారత్ మిషన్, జాతీయ గ్రామీణ లైవ్లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ వంటి పథకాలకు సంబంధించి ఎజి కార్యాలయం వివరాలు కోరినట్లు తెలిసింది.

బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, అందులో చేసిన వ్యయం, మిగిలిపోయిన నిధుల్లో ఎంత మేరకు తిరిగి ఖజానాకు సరెండర్ చేశారు అన్న వివరాలు సిద్ధం చేయాలని పిఎజి తన లేఖలో కోరారు. అలాగే ఎంతమంది లబ్దిదారులకు ఈ పథకాలు అందించారు, అందుకు ఎంత ఖర్చు చేశారన్న వివరాలు కూడా తెలపాలని ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించేందుకు తమ అధికారులు వస్తారని, వారికి అన్ని విధాల సహకరించాలని అన్ని శాఖలకు సూచించారు. దీనికోసం ఆయా శాఖలు లైజనింగ్ అధికారులను కూడా నియమించాలని ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం కోరింది. ఈ లేఖల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు.



ప్రధాని నరేంద్ర మోడీ, యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సమక్షంలో ఒప్పందాలు మార్చుకుంటున్న శక్తికాంత దాస్, ఖలీద్ మహ్మద్ బలామ

యుఎఇతో రూపాయిల్లో వాణిజ్యం

ఆర్‌బిఐ, సిబియుఎఇ ఒప్పందం

న్యూఢిల్లీ : భారత్, యునైటెడ్ అరబ్ ఎమరేట్స్ (యుఎఇ) దేశాల మధ్య ఇకపై స్థానిక కరెన్సీలో వాణిజ్యం సాగనుంది. ఇందుకోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ యుఎఇ మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఇరు దేశాల మధ్య జరిగే వాణిజ్య వ్యవహారాలకు భారతీయ రూపాయి, యుఎఇ దిర్హామ్ (ఎఇడి)లతో చెల్లింపులు చేయడానికి వీలుగా ఇరు సెంట్రల్ బ్యాంక్‌లు శనివారం అబుదాబిలో కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. దీంతో సరిహద్దు లావాదేవీలను మెరుగు పరచడం, చెల్లింపులను క్రమబద్ధీకరించడం, రెండు దేశాల మధ్య బలమైన ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో పేర్కొంది.

భారత ప్రధాని నరేంద్ర మోడీ, యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సమక్షంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ యుఎఇ మిగతా 3లో

మణిపూర్‌పై మౌనం వీడండి!

- ప్రధానికి కోటి ఇ-మెయిళ్లు, పోస్టు కార్డులు
- లేఖాస్త్రాలు సంధించిన ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ
- 25 వరకు కొనసాగనున్న ప్రచారోద్యమం



మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని ఆందోళన చేస్తున్న మహిళలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో జరుగుతున్న హింసకాండపై భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ), అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) లేఖాస్త్రాలు ఎక్కుపెట్టాయి. రాజకీయంగా లబ్ది పొందేందుకు గిరిజన తెగల మధ్య బిజెపి రాజేసిన విద్వేషాగ్ని వల్ల వంద మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్లు తగలబడ్డాయి. మణిపూర్‌లో ఇంతటి హింసాకాండ సాగిపోతున్నా ఇప్పటి వరకూ ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోరు మెదిపింది లేదు. మణిపూర్‌లో హింసాకాండను ఆపేందుకు తక్షణమే భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ3 నెల 13న యూరోపియన్ యూనియన్ (ఇయు) పార్లమెంటు కూడా తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ తీర్మానాన్ని భారత ప్రభుత్వం ఖండించిందే కానీ మోడీ మాత్రం ఒక్క మాటైనా మాట్లాడింది లేదు. ఈ నేపథ్యంలో 'మిస్టర్ మోడీ మణిపూర్‌పై మౌనం వీడండి!' అంటూ ప్రధానికి కోటి ఇ-మెయిళ్లు, పోస్టు కార్డులు పంపాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ పిలుపుని చ్చింది. ఈ నెల 25 వరకు కొనసాగనున్న ఉద్యమాన్ని శనివారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, ఎఎ రహీం, వయూక్ బిస్వాస్, హిమఘ్నరాజ్ భట్టాచార్య లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రధానికి ఇ-మెయిళ్లు, లేఖలు పంపాలని పిలుపుని చ్చారు. ఇకనైనా 'ప్రధానమంత్రి మాట్లాడతారా?' అని వారు ఈ సందర్భంగా నిలదీశారు. 'మణిపూర్‌లో అశాంతి నెలకొని రెండు నెలలు దాటింది. పదే పదే ఫిర్యాదులు చేసినప్పటికీ, ఈ కీలకమైన అంశంపై ప్రధాని మౌనంగా ఉన్నారు' అని వారు విమర్శలు గుప్పించారు. ఇ-మెయిళ్లు, పోస్టు కార్డుల ప్రచారోద్యమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని మణిపూర్ ప్రజానీకానికి సంఘీభావం తెలియజేయాలని పిలుపుని చ్చారు. మణిపూర్‌లో పరిస్థితిని పరిష్కరించడానికి ప్రధానిపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భావసారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలు, ప్రజాస్వామ్య, పౌర సంఘాలు కృషి చేయాలని కోరారు. విద్వేష రాజకీయాలను ఐక్యంగా ఎదుర్కొని మణిపూర్‌కు సంఘీభావంగా నిలుద్దామని కోరారు.

గంగవరం పోర్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- 17న కలెక్టర్‌కు సామూహిక వినతి పత్రం అందజేత

లోపలి పేజీలో..

ఇటలీలో సమ్మెల హోరు

- ఆగిన రైళ్లు, విమానాలు !

అమ్మో జులై!



స్పిల్ వే 48 గేట్ల నుండి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

- హడలెత్తిపోతున్న గోదావరి పరీవాహక ప్రజలు
- కొండలు, గుట్టలపై తలదాచుకున్న ఘటనలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జులై మాసం వచ్చిందంటే గోదావరి పరీవాహక ప్రజలు హడలెత్తిపోతున్నారు. గోదావరి వరద ఉధృతితో ఇళ్లు వదిలి కొండలు, గుట్టలపైనే ప్రాణభయంతో తలదాచుకున్న ఘటనలు మళ్లీ పునరావృతవుతాయోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఇప్పటివరకూ గోదావరికి జులైలోనే 11సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక, నాలుగు సార్లు తుది ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటికే గోదావరి నీటిమట్టం పెరగడంతో సమీప గ్రామాల ప్రజలు భయందోళనకు గురువుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పాలనా యంత్రాంగం ఇప్పటివరకూ అప్రమత్తం చేసే దిశగా చర్యలు చేపట్టకపోవటం గమనార్హం.

జులైలోనే అత్యధిక సార్లు వరద పోటు

1953 నుంచి ఇప్పటి వరకూ గోదావరికి 30 సార్లు మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించింది. గోదావరి నది చరిత్రలో రికార్డు చేసిన వివరాల ప్రకారం 1953లో తొలిసారి 72.5 అడుగుల స్థాయిలో గోదావరికి వరదలు రావడంతో నది ఒడ్డున ఉన్న అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. 1986లో 74.6 అడుగుల రికార్డుస్థాయిలో వరద రావడంతో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయి. సర్వం కోల్పోయిన అనేక గ్రామాల ప్రజలు మెరక ప్రాంతాల వైపు ఇళ్లు నిర్మించుకున్నారు. 1990లో 70.8 అడుగుల నీటిమట్టానికి వరద రావడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కుక్కునూరు, వేలేరుపాడు, వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, చింతూరు మండలాల్లోని గోదావరి పరీవాహక లోతట్టు గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. జూలైలోనే గోదావరికి 11సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటడమే కాక ఇందులో నాలుగుసార్లు తుది ప్రమాద హెచ్చరికను (53అడుగులు) సైతం దాటడం గమనార్హం. గతేడాది జూలై 16న భద్రాచలం వద్ద 71.3 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది. 35 ఏళ్ల తర్వాత 70 అడుగుల మార్కును మరోసారి దాటింది.

1972 జూలై 6న 44.3 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 29న 54.3, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న మిగతా 2లో

పెరిగిన గోదావరి నీటిమట్టం

- 48 గేట్ల నుంచి దిగువకు వరద జలాలు

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

ఎగువ ప్రాంతాల్లో గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి 15.97 మీటర్లుగా ఉన్న గోదావరి నీటిమట్టం శనివారం ఉదయానికి 19.12 మీటర్లకు చేరింది. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద బ్యాక్ వాటర్ పెరగడంతో సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా గొందూరు గండి పోచమ్మ ఆలయంలోకి గోదావరి వరద జలాలు ప్రవహిస్తున్నాయి. దీంతో ఆలయానికి రాకపోకలను నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్‌డ్యామ్‌కు 902 హిల్ ప్రాంతం నుంచి వాహనాల రాకపోకలు సాగించేందుకు స్పిల్ వే ఛానల్‌లో వేసిన రోడ్డు మార్గం నీట మునిగింది. స్పిల్ వే 48 గేట్ల నుండి వరద జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద 19 అడుగులకు నీటి మట్టం చేరడంతో రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజీలోని 175 గేట్లల్లో 48 గేట్లు ఎత్తి దిగువకు 28 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ధరల స్థిరీకరణ ద్వారా నిధులు విడుదల చేయాలి

- సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, అందుకోసం ధరల స్థిరీకరణ నిధి ద్వారా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు అవసరమైన ధరల స్థిరీకరణ నిధులను కేంద్రం అందించాలని పేర్కొన్నారు. భారీగా పెరుగుతున్న టమోటా ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్‌లకు మార్గదర్శకాలు జారీ చేసిందని, టమోటాను సబ్సిడీపై ఎక్కువ ధరలున్న చోట్ల ప్రజలకు అందించాలని కేంద్రం ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రజానీకానికి, కార్మిక వర్గానికి పూర్తిస్థాయిలో ఉపశమనం కలగదని అన్నారు. ధరలను నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యమని పేర్కొన్నారు. ఇకనైనా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడంతోపాటు రాష్ట్రాలకు అవసరమైన నిధులు కేటాయించాలని, కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకుండా అన్ని రాష్ట్రాల ప్రజానీకానికి సరుకులు సబ్సిడీపై సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రంగనాయకస్వామి ఆలయంలో రూ.5.20 కోట్ల నగదు, కిలోన్నర వెండి మాయం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులోని రంగనాయకస్వామి గుడిలో రూ.5.20 కోట్ల నగదు, కేజీ సిల్వర్, బంగారం మాయమయ్యాయి. నిధుల గోల్‌మాల్‌పై వారం రోజులపాటు ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికారుల అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం, కలిపి పెద్ద మొత్తంలో నగదు, నగలు, వెండి తారుమారైనట్లు గుర్తించారు. దేవాలయంలో రూ.2.10 కోట్ల నగదు, దేవాలయ భూముల్లో రూ.3.10 కోట్ల నగదును కాజేశారు. 1.200 కేజీల సిల్వర్, 220 గ్రామల బంగారం రికార్డులో లేకుండా పోయాయి. అక్రమార్కులపై కేసు నమోదు చేశారు. ఎసిబి సోదాల నేపథ్యంలో ప్రభుత్వానికి కట్టాల్సిన రూ.41 లక్షల బకాయిలను ఆగమేఘాల మీద చెల్లించారు.

అల్లంచెర్లరాజుపాలెం భూముల ఆక్రమణ

- చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లా టి నర్సాపురం మండలం అల్లంచెర్లరాజుపాలెంలో అటవీ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు శనివారం లేఖ రాశారు. అల్లంచెర్లరాజుపాలెంలోని పాత సర్వే నెంబరు 453లో పర్యావరణ పరంగా విలువైన అటవీ భూమి అన్యాక్రాంతం అవుతోందని తెలిపారు. అటవీ ప్రాంతం కింద 3,255 ఎకరాల అటవీ భూమి 1950 నుంచి అటవీశాఖ ఆధీనంలో ఉందన్నారు. అటవీశాఖ అధికారులకు చెప్పకుండా రెవెన్యూ అధికారులు కొంతమేర అటవీ భూమిని గతంలో సాగుభూమిగా ప్రకటించారని వివరించారు. న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయంపై కోర్టుల్లో వివాదం నడుస్తుందని తెలిపారు. దీనిని ఆసరా చేసుకుని అల్లంచెర్లరాజుపాలెం అటవీ బ్లాక్ పరిధిలోని 226, 227, 231, 232, 233 సర్వే నెంబర్లలోని భూమి తమ ఆధీనంలో ఉందని ఆక్రమణదారులు, వారి వారసులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారని వివరించారు. ఈ భూముల విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయినా ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని, బోరు బావులు తవ్వుతున్నారని పేర్కొన్నారు. తద్వారా భూమి తమ ఆధీనంలో ఉందని, దానిని అటవీ భూమిగా ప్రకటించడం చట్టవిరుద్ధమని పిటిషనర్లు తప్పుడు వాదనలకు దిగుతున్నారని వివరించారు. ఈ ప్రయత్నాలకు, అక్రమ రెవెన్యూ రికార్డులు సృష్టించడానికి వైసిపి ప్రభుత్వం వారికి మద్దతు ఇస్తోందని విమర్శించారు. కేంద్ర అటవీ పర్యావరణశాఖ వెంటనే జోక్యం చేసుకుని అటవీ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. తక్షణమే మొత్తం అటవీ భూమిని సర్వేచేసి స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రభుత్వం గట్టిగా పోరాడాలన్నారు. భూకబ్జాదారులతో కుమ్మక్కైన సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీలకు యూనిట్‌కు రూ.9 వసూలు

- కమర్షియల్ వినియోగం లెక్కగడుతున్న ట్రాన్స్‌కో
- పైగా వడ్డీలు, చక్రవడ్డీలు, ట్రూఅప్, అడ్జస్ట్‌మెంట్ బాదుడు
- లెక్కగట్టే మీటర్లు లేకుండానే బిల్లులా ?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కునారిల్లిపోయిన పంచాయతీలతో విద్యుత్‌శాఖ వాణిజ్య వ్యాపారం చేస్తోంది. వీధిలైట్లకు ఇతర అవసరాలకు వాడుకునే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.9 చొప్పున వసూలు చేసింది. ప్రజా ప్రయోజనం ఉన్న వీధిలైట్లకు వాణిజ్యపరంగా లెక్కగట్టడం ఎంతవరకు సమంజసమని సర్పంచులు ప్రశ్నిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ఇప్పటి వరకూ ఏ గ్రామ పంచాయతీలోనూ వీధిలైట్ల వినియోగానికి సంబంధించి మీటర్లు లేవు. అయినా ఇన్ని యూనిట్లు వాడారనే పేరుతో వాణిజ్య వినియోగంగా పరిగణించి పంచాయతీల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల పేరుతో వరుసగా రూ.550 కోట్లు, రూ.238 కోట్లు, రూ.996 కోట్లు ఇలా మూడు విడతలుగా ప్రభుత్వం డబ్బులు వెనక్కు తీసుకుంది. బిల్లులు బకాయిలు కట్టేశామని సమాధానం ఇచ్చింది. అయితే ఫలానా పంచాయతీ ఇంత బిల్లు కట్టాలని గానీ, కట్టిందని గానీ వారికి ఎటువంటి నోటీసూ ఇవ్వలేదు. ఇవ్వకుండా బిల్లులు జమచేసుకోవడం విచిత్రం. పోనీ జమైనదానికి లెక్కలన్నా ఉన్నాయా అంటే అదీ లేదు. దీనిపై పంచాయతీ సర్పంచుల సంఘం కూడా కొత్త నిర్ణయానికి వచ్చింది.

పంచాయతీలో వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ విభాగాన్ని కూడా వాణిజ్యఖాతాలో వేసి స్తంభాలు, విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు పన్నులు వేయాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ చట్టంలో దీనికి ప్రొవిజన్ ఉందా? లేదా? అనే అంశంపైనా చర్చించారు. సెక్షన్ 263లో విద్యుత్ విభాగానికి సంబంధించిన అంశాలు ఉన్నా అందులో బిల్లుల వసూలుపైనే ఉంది. అయితే విద్యుత్‌శాఖకు పన్నులు విధించొచ్చా? లేదా? అనే అంశంపై స్పష్టత లేదు. వివిధ విభాగాలకు సంబంధించి యూజర్ ఛార్జీలు వసూలు చేసుకునే అధికారం పంచాయతీలకు ఇస్తూ పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచారు. ఇదే చట్టంలో విద్యుత్ సరఫరాను ప్రజోపయోగమైన విభాగంలో ఉంచారు. చట్టంలో ప్రజోపయోగమైన వెలుతురు ఇచ్చే వీధిలైట్లు అని పేర్కొన్నా విద్యుత్‌శాఖ వాణిజ్యపరంగా బిల్లులు వసూలు చేయడంపై ఏమిటనే అంశంపైనా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. అసలు బకాయిలు ఎంత, ఎంత కట్టాలి, ఇంకా ఎంతకట్టాలి అనే లెక్కలు వచ్చినప్పుడు ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

యూజర్ ఛార్జీల్లో అవసరమైతే స్తంభాలకు పన్నులు వేసే అంశాన్ని తీర్మానం చేస్తామని, పంచాయతీ తీర్మానమే చెల్లుబాటవుతుందని పేర్కొన్నారు. వాణిజ్య విభాగం కింద బిల్లులు వేస్తూ, ట్రూఅప్, అడ్జస్ట్‌మెంట్ భారాలు వేస్తున్నారని, ఇదీ చాలదన్నట్లు బిల్లులకు వడ్డీలు, దానికి చక్రవడ్డీలు వేస్తున్నారని తెలిపారు. గుంటూరు జిల్లా మేడికొండూరు పంచాయతీకి రూ.40 లక్షల బకాయి ఉన్నట్లు పంపారని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు. బిల్లులు కట్టామని చెబుతున్నా వడ్డీలు వేయడం ఏమిటని సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు కృష్ణమోహన్ ప్రశ్నించారు.



విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మస్టర్ పాయింట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రైల్వే కాంట్రాక్టు కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం

- వివిఎల్ నరసింహులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే స్టేషన్‌లో గత రెండేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో కొందరిని తొలగించారని, కాంట్రాక్టు కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలంటూ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని మస్టర్ పాయింట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎల్ నరసింహులు మాట్లాడుతూ.. విజయవాడ రైల్వే స్టేషన్‌లో 250 మంది కాంట్రాక్టు సిబ్బంది ప్లాట్‌ఫారమ్స్ శుభ్రం చేయడం, క్లీనింగ్ పనులను రెండేళ్లుగా రక్షక్ సెక్యూరిటీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కింద పనిచేస్తున్నారని అన్నారు. ఈ నెల 14తో కాంట్రాక్టు కాలపరిమితి పూర్తయ్యిందని, మరలా అదే సంస్థకు రైల్వేశాఖ టెండర్ ఇచ్చిందని వివిఎల్ నరసింహులు పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న 250 మంది కార్మికులకు గానూ ఆ సంస్థ కేవలం 55 మందిని మాత్రమే పనిలో పెట్టుకుందన్నారు. కార్మికుల వయసు 50 ఏళ్లు దాటిందనే కారణంతో కాంట్రాక్టు ఉద్యోగులను పనిలో నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో రైల్వే యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌లా పనిచేసిన కార్మికులను ఇలా తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులందరినీ పనిలోకి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇవి నారాయణ, ఎవి రావు, బి సత్తిబాబు, జి ప్రసన్న, ఎ లావణ్య, సుజాత, నర్సమ్మ పాల్గొన్నారు.

వైసిపి దాష్టీకాలపై ప్రజాక్షేత్రంలో సమిష్టి పోరాటం

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యం, రాజ్యాధికారం ఎవరి సొంత సొత్తుకాదని, వైసిపి దాష్టీకాలపై ప్రజాక్షేత్రంలో సమిష్టి పోరాటం చేసే సమయం వచ్చిందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వైసిపి నేత ఆమంచి శ్రీనివాసులు (స్వాములు) ఆయన కుమారుడు రాజేంద్రతోపాటు పెద్దఎత్తున కార్యకర్తలతో పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. శ్రీకాళహస్తిలో కొట్టేసాయి అనే కార్యకర్తపై చేయి వేసిన పోలీసులను ప్రశ్నించేందుకు ఈ నెల 17న తిరుపతికి వెళ్లనున్నట్లు పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రజా సమస్యలపై జగన్ అంటే భయం లేకుండా తెగించి పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో నిత్యం ప్రభుత్వ తీరును ఎండగడదామన్నారు. ఆమంచి స్వాములు పార్టీలో చేరడంతో ప్రకాశం జిల్లాతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ పార్టీకి అదనపు బలం చేకూరుతుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల కాపు జెఎసి గౌరవాధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు, డాక్టర్ దండె శివకుమార్ కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

25 వేల ఎకరాల సాగు పట్టదా

- హైలెవల్ ఛానెల్ రైతుల సమావేశంలో కృష్ణయ్య ఆగ్రహం
- కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-దుగ్గిరాల

రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతు గోడు పట్టని ప్రభుత్వాన్ని ఎవరూ క్షమించరని ఆయన అన్నారు. మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లోని 25 వేల ఎకరాలకు అధారమైన హైలెవల్ ఛానెల్ పరిధిలోని రైతుల సదస్సు శనివారం ఉదయం దుగ్గిరాల మండలంలోని పెనుమూలిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ ఐదు మండలాల్లో అత్యంత విలువైన పంట భూములకు నీరందించే విషయంలో ప్రభుత్వం వేగంగా స్పందించడం లేదని విమర్శించారు. ఛానెల్‌లోకి నీరు రావడానికి రూ.9 కోట్లు వెచ్చిస్తే సరిపోతుందని, అది ప్రభుత్వానికి పెద్ద సమస్య కాదని, వేలఎకరాల రైతులకు అది సంజీవనని అన్నారు. దీనిపై ఇరిగేషన్ డెవలప్‌మెంట్ అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రూ.11,900 కోట్ల రూపాయలు వ్యవసాయానికి కోటాయించారని, అందులో తొమ్మిది కోట్లు పెద్ద లెక్కగాదని అన్నారు. దీనివల్ల 25 వేల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని తెలిపారు. చిన్న ప్రాజెక్టు అయినప్పటికీ ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుందని, రూ.400 కోట్ల విలువైన అహార ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన రైతు పోరాటాలను అదర్శంగా తీసుకుని రైతులు ఉద్యమించాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ రైతుల ఆందోళనతో 2017లో హైలెవల్ ఛానెల్ లిఫ్టు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పటి వరకూ పూర్తి కాలేదని తెలిపారు. కాంట్రాక్టరుకు నిధుల చెల్లింపులో ఆలస్యం అవుతుందని దీని ప్రభావం నిర్మాణంపై పడుతుందని తెలిపారు. తక్షణం హైలెవల్ ఛానెల్‌కు నీటిని అందించేందుకు అవసరమైన అన్ని రకాల పనులూ పూర్తి చేయాలని ఆయన కోరారు. రైతు సంఘం జిల్లా నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైతు రాజ్యంలో వారి గోడు పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు క్షోభ కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాలువలు పూడుకుపోయి చివరి భూములకూ నీరు అందడం లేదని, బకింగ్‌హామ్ కెనాల్‌కు ఎనిమిది వేల క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తేగానీ హైలెవల్ ఛానెల్‌కు నీరు అందదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెనుమూలి సదస్సులో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

పోరాట కమిటీ ఏర్పాటు

సదస్సు అనంతరం హైలెవల్ ఛానల్ పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ములకా శివసాంబిరెడ్డి, కో కన్వీనర్‌గా వై.బ్రహ్మేశ్వరరావు ఎన్నికయ్యారు. సభ్యులుగా బి.అమ్మిరెడ్డి, ఎన్.యోగేశ్వరరావు, కె.భాస్కరరావు, కావూరి వాసు, కాలిశెట్టి కోటేశ్వరరావు, గంపల భూషయ్య, టి.ప్రసాదరెడ్డి, కె.మాధవరెడ్డి, ఎ.వెంకటరెడ్డి, జె.అప్పిరెడ్డి ఉన్నారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, అధ్యక్షులు జె.బాలరాజు, కౌలు రైతు సంఘం మండల నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, పెనుమూలి గ్రామ మాజీ సర్పంచ్ నందిపాటి జోగారావు పాల్గొన్నారు.


శివసాంబిరెడ్డి


వై.బ్రహ్మేశ్వరరావు

ఉపాధ్యాయుడి దారుణ హత్య

ప్రజాశక్తి-రాజాం, రేగిడి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లాలో ఓ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యారు. పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బొలేరో వాహనంతో ఢీకొట్టారు. ఈ సంఘటన తెర్లాం మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్దవోలు గ్రామానికి చెందిన ఏగిరెడ్డి కృష్ణ (48) కాలంరాజుపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

భార్యతో కలిసి రాజాంలోని ఈశ్వర నారాయణ కాలనీలో నివాసం ఉంటున్నారు. కృష్ణమూర్తి రోజూ రాజాం నుంచి పాఠశాలకు బైక్‌పై వెళ్లి వస్తుంటారు. రోజు మాదిరిగానే పాఠశాలకు బయలుదేరిన కృష్ణమూర్తిని ఒమ్మి-కొత్తపేట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి బొలేరో వాహనంతో వేగంగా ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంతోపాటు రోడ్డుపై పడిపోయిన కృష్ణమూర్తిని బొలేరో వాహనంతో కొంత దూరం ఈడ్చుకెళ్లారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను రాడ్డుతో కొట్టి చంపారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. ఉపాధ్యాయుడి హత్య గురించి తెలుసుకున్న గ్రామస్తులు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రహదారిపై బైఠాయించారు.


డిఎస్‌పి శ్రీనివాస్ చక్రవర్తి, రాజాం సిఐ రవికుమార్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేపిటల్‌గా రాష్ట్రం

- లోకేష్ విమర్శ
- గవర్నరుకు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ పాలనలో రాష్ట్రం గంజాయికి కేపిటల్‌గా మారిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. డ్రగ్స్ వల్ల రాష్ట్రంలో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌ను కలిసి శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ నిరోధానికి చర్యలు తీసుకోవాలని గవర్నరును కోరామన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మేడ్ ఇన్ ఆంధ్ర అని తేలుతుందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో గంజాయి బాధిత కుటుంబాలు తనకి తెలియజేశాయని చెప్పారు. గంజాయిపై యుద్ధం ప్రకటించామని, ఈ మహమ్మారిపై పోరాడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. 'గంజాయి వద్దు బ్రో' పేరుతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఏ నేరం జరిగినా, ఘోరం చోటుచేసుకున్నా దాని వెనుక గంజాయి ఉంటోందని పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు గంజాయి వల్లే దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను అత్యంత దారుణంగా హత్య చేసి డెడ్ బాడీ డోర్ డెలివరీ చేశారని, వీటిన్నిటినీ ఆధారాలతో సహా గవర్నరుకు ఇచ్చామని వివరించారు. గంజాయి పంట, రవాణా, అమ్మకం వరకూ మొత్తం వెనుక వైసిపి ఉందని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో అసత్యాలతో కూడిన ఫ్లెక్సీలు వేసి రెచ్చగొట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వలంటీర్లను పార్టీ కార్యకర్తల్లా రాజకీయ అవసరాలకు వాడుకోవటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వద్ద సమగ్ర సమాచారం ఉండగా, వలంటీర్ల ద్వారా మళ్లీ సేకరణ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లాలంటే ఇచ్చిన హామీలను నెరవేర్చాలి కదా అంటూ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. గవర్నరును కలిసిన వారిలో శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర ఉన్నారు.


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లోకేష్


బోరుబావి నుంచి వస్తున్న మంటలు

పంట పొలంలో గ్యాస్ మంటలు

- అదుపులోకి వచ్చిన గ్యాస్ లీకేజీ

ప్రజాశక్తి- రాజోలు

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బోరుబావి నుంచి మంటలు ఎగిసిపడుతున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. దాదాపు ఎనిమిది గంటలు పాటు మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. రాజోలు మండలంలోని శివకోటిలోని ఓ రైతు ఆక్వా చెరువు కోసం తన పొలంలో శుక్రవారం బోరు బావిని తవ్వించారు. శనివారం ఉదయం అందులోనుంచి మంటలు, గ్యాస్ ఎగిసిపడటం ప్రారంభమయ్యాయి. ఓఎన్‌జిసి, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. గ్యాస్ పైప్‌లైన్ నుంచి వచ్చే మంటలయితే అదుపు చేయగలమని.. భూమి పొరల్లోని నిక్షేపాల నుంచి గ్యాస్ లీకైతే మాత్రం మంటలు ఆర్పివేయడం కష్టమవుతుందని అధికారులు తేల్చి చెప్పారు. సుమారు ఎనిమిది గంటల పాటు మండిన గ్యాస్‌మంటలు దానంతట అవే అదుపులోకి రావడంతో గ్రామస్తులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ఘటనపై స్థానికులు, అధికారుల నుంచి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. రైతు పొలం నుంచే ఓఎన్‌జిసి పైపులైన్ వెళ్తుండటంతో.. బోరు బావి తవ్వే క్రమంలో గ్యాస్ పైపులైన్ లీకైందని స్థానికులు అంటున్నారు. 20 ఏళ్ల క్రితం గ్యాస్ నిక్షేపాలు వెలికితీసే క్రమంలో సీస్మిక్ సర్వేల్లో భాగంగా ఇదే ప్రాంతంలో బోరు వేశారని, ప్రస్తుతం అదే ప్రదేశంలో మరింత లోతుకు బోరు వేయటంతో గ్యాస్ బయటకు వచ్చి, మంటలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మంటలు గ్యాస్ పైపులైన్ నుంచి వెలువడుతున్నాయా? లేక భూమి పొరల నుంచే వస్తున్నాయా..! అన్న విషయం అంతు చిక్కడం లేదు.

ఇసుక అక్రమ విక్రయాలపై ఫిర్యాదు

- వైసిపి బహిష్కృత నేతపై పిడి యాక్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాకు చెందిన వైసిపి మాజీ నాయకుడిపై ప్రభుత్వం జిల్లా బహిష్కరణ వేటు వేసింది. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టరు సిఫార్సుతో ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు జారీ అయినప్పటి నుంచి క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన కంచేటి సాయి అజ్ఞాతంలో ఉన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో ఇసుక తవ్వకాలపై సాయి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో సుప్రిం కోర్టు కూడా ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చింది. గతంలో కంచేటి సాయి వైసిపిలో కీలక నేతగా వ్యవహరించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కుడిభుజంగా వ్యవహరించారు. ఇసుక విక్రయాలలో ఎమ్మెల్యేకు, కంచేటి సాయికి వివాదాలు వచ్చాయి. దీంతో సాయిని పార్టీ నుంచి బహిష్కరించారు. తరువాత ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్టు సాయి భార్య తులసీ ఆరోపించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినందుకే తన భర్తపై అక్రమ కేసులుపెట్టి జిల్లా బహిష్కరణ ప్రకటించారని తెలిపారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో దోపిడీ

- మాజీ మంత్రి దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో వందలకోట్లు కమీషన్లు దండుకుని, వచ్చే ఎన్నికల కోసం రిజర్వ్ చేసి పెట్టుకున్నారని మాజీ మంత్రి, టిడిపి నేత దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఇరిగేషన్ శాఖలో భారీగా అవినీతి చోటుచేసుకుందని ఆరోపిస్తూ, దీనిపై విచారణ జరిపితే సిఎం, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సిఎం కార్యదర్శి ధనంజయరెడ్డి జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంతవరకు పూర్తిచేసిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి రూ.26 వేలకోట్లు ఖర్చు పెట్టిందని చెబుతుందని పేర్కొన్నారు. ఏ ప్రాజెక్టులో ఎంతమేరకు పనులు చేసి, ఎన్ని ప్రాజెక్టుల్ని పూర్తిచేశారో, ఎన్ని ఎకరాలకు నీళ్లిచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఇరిగేషన్‌శాఖ మంత్రి అంబటి రాంబాబు పోలవరం మట్టి అమ్ముకున్నారని ఆరోపించారు. జగన్ ఢిల్లీ వెళ్లి సాధించేదేమీ లేదని విమర్శించారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- పుంగనూరు (తిరుపతి)


సోమశేఖర్ (ఫైల్)

అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువ రైతు 14 రోజులపాటు మృత్యువుతో పోరాడుతూ శనివారం మృతి చెందారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దనపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ (29) తనకున్న మూడు ఎకరాల పొలంలో దోస, కాలీఫ్లవర్, ఇతర కూరగాయల పంటలు సాగు చేశారు. పంటల సాగు కోసం రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలేక, పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. అప్పులు తీర్చాలని రుణదాతలు ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపంతో ఈ నెల 3న పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. సుమారు 14 రోజులపాటు మత్యువుతో పోరాడుతూ శనివారం మృతి చెందారు. సోమశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మో జులై!

మొదటి పేజీ తరువాయి

57, 2013 జూలై 24న 56.7, 2016 జూలై 12న 52.4 అడుగుల నీటిమట్టం నమోదైంది. 2022 జూలై 16న 71.3 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ఆగస్టు 16, 1986లో 24.55 అడుగుల గరిష్ట నీటిమట్టం నమోదయ్యింది. ఆగస్టు 25, 1990న గరిష్టంగా 22.75 అడుగులు, ఆగస్టు 7, 2006న 22.80 అడుగులు, జులై 17, 2022న 21.70 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది.

ఆందోళనలో పరీవాహక ప్రాంత ప్రజలు

ఏటపాక, విఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాలు గత ఏడాది పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండల కేంద్రాల్లో సైతం ఆరు నుంచి పది అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించింది. పంట పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు డాబాలపైకి, పల్లెల్లోని ప్రజలు కొండలపైకి వెళ్లి ప్రాణాలను కాపాడుకున్నారు. మూడు రోజుల నుంచి 20 రోజుల పాటు వరద ముంపు నెలకొంది. వరద బాధితులు తిరిగి ఇళ్లకు చేరుకునే నాటికి కొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టం కాగా మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. ధవళేశ్వరం బ్యారేజీ ఎగువను ఉన్న సీతానగరం మండలంలోని ములకల్లంక గ్రామం పూర్తిగా నీట మునిగింది. దిగువన అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద కాజ్‌వేపై, మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే, పి.గన్నవరం మండలం చాకలిపాలెం కాజ్‌వేల వద్ద డేంజర్ బెల్స్‌మోగాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కోనసీమ - పశ్చిమ గోదావరి జిల్లాలను కలిపే కనకాయిలంక కాజ్‌వే వరద నీటిలో మునిగిపోవటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరంలో పుష్కర్ ఘాట్, కోనసీమలోని కొన్ని బలహీన ఏటిగట్ల వద్ద ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి వరద పోటును కొంత మేర కట్టడి చేశారు. కోటిలింగాలపేట, శేషయ్యమెట్ట, ఆర్యాపురం, మల్లయ్యపేట, ధవళేశ్వరంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వరదల సమయంలో సీడబ్ల్యుసీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన సిబ్బంది కీలకంగ వ్యవహరించాల్సి ఉంది. ఇతర శాఖలను సమన్వయం చేసుకుని ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది.

ఇసుక తవ్వకాలపై నిషేధం లేదు

- గనులశాఖ సంచాలకులు విజి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక తవ్వకాలపై నిషేధం లేదని, చిత్తూరు జిల్లాలోని 18 రీచ్‌లలో మాత్రమే ఆపరేషన్స్ నిలిపేశామని గనులశాఖ సంచాలకులు విజి వెంకటరెడ్డి తెలిపారు. వాటిల్లోనే బి1, బి2 కేటగిరీల్లో ఇచ్చిన అనుమతులపై పున:సమీక్ష చేయాలని కోర్టు ఆదేశించిందని, అన్ని అనుమతులూ ఉన్న రీచ్‌లలో తవ్వకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందుగానే నిల్వచేశామని, న్యాయస్థానం ఇచ్చిన అన్ని అనుమతులూ అమలు చేస్తున్నామని తెలిపారు.

కొత్త పాలిటెక్నిక్ కళాశాలలకు రూ.119కోట్లు

- సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూడు పాలిటెక్నిక్ కళాశాలకు రూ.119.57 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంగీకరించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. బేతంచెర్ల, గుంతకల్, మైదుకూరులో ఈ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక విద్యకు 128 టీచింగ్, 68 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు అయ్యాయని వివరించారు. ఒకే లోకేషన్‌లో ఉన్న పాలిటెక్నిక్, ఐటీఐలను ఇంటిగ్రేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. దశలవారిగా జిల్లాకు ఒకటి చొప్పున 26 స్కిల్‌డెవలప్‌మెంట్ కళాశాలలు, 176 పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి బోధన సిబ్బంది నియామకంతో పాటు సాంకేతిక విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా కోర్సులు ఉండాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్ అవశ్యకత ఎంతో ఉందని, ఉపాధి సృష్టి, మార్కెట్ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టడం వంటి అంశాలు భవిష్యత్తులో కీలక భూమిక పోషిస్తాయని, సాంకేతిక విద్యాసంస్థల ఏర్పాటుతోనే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామీణ యువతలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించేలా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి కొత్త టెక్నికల్ కోర్సులతో పాటు నూతన సంస్థలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గృహ రుణాల ప్రాసెసింగ్ ఫీజుపై రాయితీ

- ఎస్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గృహ రుణ ప్రాసెసింగ్ ఫీజుపై డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. ప్రాసెసింగ్ ఫీజులో 50-100 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆఫర్ ఆగస్ట్ 31 వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. సాధారణ గృహ రుణం, టాప్ అప్ రుణాలకు 50 శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు పేర్కొంది. కనీస ప్రాసెసింగ్ ఫీజు రూ.2వేలు, గరిష్ఠంగా రూ.5వేలు ఉంటుంది. రీసేల్, రెడీ టు మూవ్ ప్రాపర్టీలకు అయితే 100 శాతం వరకు రాయితీ పొందవచ్చని తెలిపింది. అదే విధంగా గృహ రుణాలపై వడ్డీ రేటులోనూ తగ్గింపును ఇస్తున్నట్లు వెల్లడించింది. సిబిల్ స్కోర్ ఆధారంగా గరిష్ఠంగా 45 బేసిస్ పాయింట్లు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపింది.

ఎన్‌డిఎ సమావేశానికి పవన్‌కల్యాణ్

ప్రజశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 18న ఢిల్లీలో జరగనున్న ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాల సమావేశానికి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. సమావేశానికి రావాలని బిజెపి అగ్రనేతల నుంచి పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 17న సాయంత్రం నాదెండ్ల మనోహర్ ఢిల్లీకి చేరుకుంటారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

గంగవరం పోర్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- 17న కలెక్టర్‌కు సామూహిక వినతి పత్రం అందజేత



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

అదానీ గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 17న కలెక్టర్‌కు సామూహికంగా వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించింది. విశాఖ జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అదానీ గంగవరం పోర్టులో చట్టాలు అమలుచేయాలని కోరిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలు, మెమోలు, చార్జిషీట్లు ఇస్తూ యాజమాన్యం వారిని విధుల నుండి తొలగిస్తోందన్నారు. యూనియన్ పెట్టుకున్నందుకు అధ్యక్ష, కార్యదర్శులను తొలగించారని తెలిపారు. నోటీసు ఎందుకిచ్చారని అడిగినందుకు మరో నాయకుడిని, షిఫ్ట్ మార్చుకున్నందుకు ఇద్దరు కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. యూనియన్ ద్వారా ఎటువంటి కార్యక్రమాలు చేయబోమని బలవంతంగా సంతకాలు చేయించుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చెప్పిన తరువాత కూడా 29 మంది యూనియన్ నాయకులకు డ్యూటీలు ఆపారని తెలిపారు. ఇప్పటికే 12 రోజులుగా కార్మికులు తమ కుటుంబాలతో ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం మొత్తం కార్మికులకు నోటీసులు పంపిస్తూ బెదిరిస్తున్నారని వివరించారు. ఇటువంటి దుర్మార్గాన్ని విశాఖ ప్రజలు, కార్మికులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు నక్కా లక్ష్మణరావు (టిఎన్‌టియుసి), దొమ్మేటి అప్పారావు (హెచ్‌ఎంఎస్), బోరా శశిభూషణం (వైఎస్‌ఆర్‌టియు), కె.మల్లయ్య (ఐఎఫ్‌టియు), ఎ.శ్యామ్‌శేఖర్ (ఐఎన్‌టియుసి), గంగవరం పోర్టు యూనియన్ నాయకులు బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మణిపూస

- జాతీయస్థాయి అంథుల క్రికెట్ జట్టుకు 'సంధ్య' ఎంపిక



అంధ విద్యార్థిని సంధ్య

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

ఆ గిరిజన విద్యార్థిని పుట్టుకతోనే అంథురాలు. తాను వెలుగు చూడలేకున్నా తనలో దాగి ఉన్న ప్రతిభతో చదువుతున్న పాఠశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి వెలుగు నింపుతోంది. అంథురాలనే చింతను పక్కనపెట్టి చదువులోనూ, క్రికెట్‌లోనూ సత్తా చాటుతూ జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు నిలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కొండశిఖర గిరిజన గ్రామమైన బాతుగొడవకు చెందిన అంథ విద్యార్థిని కిల్లక సంధ్య జాతీయస్థాయి అంథుల క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి అంథుల క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి 27వ తేదీ వరకు ఇంగ్లాండ్‌లో జరగనున్న ప్రపంచ క్రికెట్ పోటీల్లో ఇండియా తరపున ఆడనున్నారు. సంధ్య ప్రస్తుతం విశాఖపట్నం మంగమరిపేటలోని చిన్నజీయర్‌స్వామి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. చదువుతోపాటు క్రికెట్ పట్ల మక్కువ చూపడంతో పాఠశాల యాజమాన్యం క్రికెట్ క్రీడలో శిక్షణ ఇచ్చింది. బౌలింగ్ విభాగంలో సంధ్య ప్రతిభ చూపారు. బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి క్రికెట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీసి రికార్డు సృష్టించారు. ఉమన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారం అందుకున్నారు. గిరిజన ప్రాంతం నుంచి ఒక ఆణిముత్యం జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల సంధ్య తల్లిదండ్రులు కె.పెంటయ్య, కామి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హింసపై 28నుండి మహిళల 'పోరుయాత్ర' : ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఈ నెల 28 నుండి రాష్ట్ర వ్యాప్తంగా పోరుయాత్ర చేపడుతున్నట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. కర్నూలులోని సుందరయ్య భవన్‌లో ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న హింసను నిర్మూలించాలని ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు మహిళా జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 28 నుండి ఆగస్టు 8వ తేదీ వరకు జాతాలు నిర్వహించి అదే రోజు విజయవాడలో మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళల చట్టాలు అమలు చేసి, హక్కులు కల్పించాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ అన్ని జిల్లాల్లో ఈ జాతాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై హింస రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. ఓర్వకల్ మండలం నన్నూరులో ఇద్దరు కోడళ్లను కుటుంబ సభ్యులే హత్య చేసిన సంఘటన చూశామన్నారు. గోనెగండ్ల మండలం గంజహళ్లిలో 13 యేళ్ల బాలికపై అత్యాచారం చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. కోసిగిలో ప్రభుత్వ పాఠశాలలో మహిళా టీచర్‌పై అత్యాచారయత్నం చేసిన వారిపై ఇంతవరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు. అనంతపురం జిల్లా రాప్తాడులో మహిళల సంరక్షణ అధికారిగా ఉన్న మహిళ, దళితుడిని వివాహం చేసుకున్నారని ఆమెను చంపేశారన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, దాడులకు సంబంధించిన కేసులను అన్నింటిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు అప్పజెప్పి తక్షణం శిక్షలు పడేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 17న ఢిల్లీలో బాధిత మహిళలతో న్యాయ నిపుణులతో సమావేశం ఉంటుందన్నారు. అక్టోబర్ 5న ఢిల్లీలో భారీ ప్రదర్శన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డేటా భద్రతపై సిఎం జగన్ నోరు విప్పాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు చోరీకి గురవుతున్నాయనే ఆరోపణలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడు దల చేశారు. గతంలో జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా, ప్రజల డేటాకు భద్రత కరువైందని, ఆనాటి ప్రభుత్వం ప్రజల పూర్తి వివరాలను దొంగతనంగా, మోసపూరితంగా సేకరించి మరొకరికి చేరవేస్తున్నదని విమర్శించారని గుర్తుచేశారు. ఇప్పుడు వైసిపి కూడా డేటా భద్రతకు తూట్లు పొడుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయని, దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో ప్రత్యేక హోదా కోసం జరిగిన ఆందోళనపై కేసులు పెట్టి శిక్షలు పడేదాకా పట్టుబట్టి వ్యవహరించిన వైసిపి ప్రభుత్వం అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ముగిసిన 'బిఎస్ రావు' అంత్యక్రియలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బిఎస్ రావు అంత్యక్రియలు శనివారం ముగిశాయి. తొలుత విజయవాడ తాడిగడపలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల మెయిన్ క్యాంపస్ నుంచి బిఎస్‌రావు అంతిమయాత్ర ప్రారంభమైంది. శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రారంభం నుంచి బిఎస్‌రావుతో కలిసి ఉన్న నాగేంద్ర కుమార్, బిఎస్‌రావు మనువడు కలిసి సంయుక్తంగా గోశాలలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు. దారి పొడవునా బిఎస్‌రావు జోహార్ అంటూ నినాదాలు చేస్తూ అంతిమ వీడ్కోలు పలికారు.



బిఎస్ రావు అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు, ఉద్యోగులు

సోషల్ మీడియా ద్వారా ప్రచారం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర పథకాలకు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం ద్వారా ఈ రాష్ట్రానికి ప్రధాని మోడీ ఏమి చేస్తున్నారనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు ఆమె సూచించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం బిజెపి సోషల్ మీడియా ప్రతినిధులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనరు కేశవ్ కాంత్ పాల్గొన్నారు.

విప్లవకారులెలా ఉంటారో పవన్‌కు తెలుసా ? : రోజా

ప్రజాశక్తి - నందికొట్కూరు/పగిడ్యాల

విప్లవకారుడినని పవన్ కల్యాణ్ చెప్పుకోవడం సిగ్గుచేటని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా అన్నారు. విప్లవకారుడంటే ఎలా ఉంటారో పవన్ కల్యాణ్‌కు తెలుసా? అని ప్రశ్నించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు, పగిడ్యాలలో రూ.2.38 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాలను శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం పాతముచ్చుమర్రి గ్రామంలోని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నివాసంలో ఆమె విలేకరు సమావేశంలో మాట్లాడారు. పవన్ కల్యాణ్ వార్డు సభ్యుడిగా కూడా గెలవలేడని ఎద్దేవా చేశారు. రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురించి మాట్లాడడం సరికాదన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా క్రీడా కార్యక్రమాలు చేపట్టి క్రీడల అభివృద్ధికి దాదాపు రూ.ఐదు కోట్ల ఖర్చు చేసినట్లు తెలిపారు. మంత్రి ఆర్‌కె.రోజా పర్యటన సందర్భంగా నందికొట్కూరు, పగిడ్యాలలో వెలిసిన ప్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే సొంత పనుల మీద క్యాంపు వెళ్లినట్లు ఆయన వర్గీయులు తెలిపారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్ మధ్య వర్గ విబేధాలున్నాయని అందుకే రాలేదని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

యుసిసిపై సంఘటిత పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరినీ పరిగణనలోకి తీసుకోవాలని, ఏకపక్షంగా యుసిసి విధించడాన్ని ఎంత మాత్రమూ అనుమతించరాదని ఏచూరి పేర్కొన్నారు. ఈ తరుణంలో యుసిసి అమలు అనవసరమని 21వ లా కమిషన్ నివేదిక స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఏచూరి గుర్తు చేశారు.

దేశంలోని ప్రతి ఒక్క సామాజిక తరగతికి తమదైన గౌరవం, విలువ వుంటాయని, సమానత్వానికి సిపిఎం మద్దతిస్తుంది, కానీ అది ప్రజాస్వామ్యయుతంగా వుండాలన్నారు. వివిధ సామాజిక తరగతులకు విభిన్నమైన మతాచారాలు, సాంప్రదాయాలు వుంటాయి. పరిపక్వత అంటే వైవిధ్యతను ఆమోదించడమే. రాజ్యాంగం వైవిధ్యతను గుర్తించాలని అన్నారు.

మణిపూర్‌పై మోడీ మౌనమెందుకు?

దేశంలో మారణహోమం అనేది నిత్యకృత్యంగా మారింది. మణిపూర్‌లో ఏం జరుగుతోంది? మతపరంగా ప్రజలను చీల్చే ఉద్దేశంతోనే చట్టాలు అమలు చేస్తున్నారు. ఈ లక్ష్యంతోనే బిజెపి కూడా యుసిసిని చర్చిస్తోంది. దేశంలో దాదాపు రోజూ ముస్లిం గ్రూపులపై దాడులు జరుగుతునే వున్నాయి. ఒకపక్క మారణహోమం కొనసాగుతున్నా ప్రధాని మాత్రం ఈ విషయాలపై అసలు నోరు విప్పడం లేదని ఏచూరి విమర్శించారు. సమాజంలో మతపరమైన చీలికలు తీసుకురావడానికి ఉమ్మడి పౌర స్మృతిని ఒక రాజకీయ సాధనంగా బిజెపి ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు.

భారత రాజ్యాంగం సమానత్వం కోసం నిలబడినట్లే సిపిఎం కూడా సమానత్వం కోసం నిలబడుతుందని అన్నారు. ఆ సమానత్వం కోసమే మనం పోరాడాల్సిన అవసరం వుందని అన్నారు. మనలో ప్రతి ఒక్కరం ముందు మనిషి అని ఆ తర్వాతే మిగతావన్నీ అనుసరిస్తాయని ఆయన పేర్కొన్నారు. భారతీయులపై యుసిసి కలిగించే ప్రభావం పట్ల ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఏకరూపతను విధించడానికి జరిగే ఏ ప్రయత్నమైనా దేశ సామాజిక కూర్పును చీలుస్తుందని హెచ్చరించారు. కేవలం ప్రజలను విభజించడానికి ఉద్దేశించిన నినాదమే యుసిసి, అంతేకానీ వాస్తవానికి ఎలాంటి ఏకరూపతను సాధించలేమన్నారు. సరోవర్ బయోపార్క్ సమీపంలో కాలికట్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ సెమినార్‌కు లౌకిక వాదులు, వివిధ సామాజిక తరగతుల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమస్త కేరళ జమైతుల్ ఉలేమాతో సహా ముస్లిం కమ్యూనిటీకి చెందిన అనేక సంఘాలు, సంస్థలు, వివిధ క్రైస్తవ సంఘాలు సెమినార్‌లో పాల్గొన్నాయి. ఎంపీలు ఎలమారమ్ కరీం, జోస్ కె.మణి, మంత్రులు పి.ఎ.మహ్మద్ రియాజ్, ఎ.కె.శశీంద్రన్, అహ్మద్ దేవర్‌కోవిల్, వివిధ క్రైస్తవ మతాధిపతులు, బిషప్‌లు హాజరయ్యారు. వివిధ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సంఘాల ప్రతినిధులు కూడా సెమినార్‌లో పాల్గొన్నారు.

యుఎఇతో రూపాయిల్లో వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ ఖలీద్ మహ్మద్ బలమా ఈ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. కరెంట్ ఖాతా లావాదేవీలు, అనుమతించబడిన మూలధన ఖాతా లావాదేవీలను కవర్ చేసే లోకల్ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌సిఎస్‌ఎస్)ను అమలు చేయడం దీని లక్ష్యం. రూపాయి, దిన్హార్‌తో విదేశీ మారకపు మార్కెట్‌ను సృష్టించడం, పెట్టుబడులను సులభతరం చేయడం, రెండు దేశాల మధ్య చెల్లింపులను క్రమబద్ధీకరించడం అంతిమ ఉద్దేశ్యం. యుఎఇలో నివసిస్తున్న భారతీయుల చెల్లింపులతో సహా, స్థానిక కరెన్సీల వాడకం లావాదేవీల ఖర్చులు, లావాదేవీల కోసం సెటిల్మెంట్ సమయాన్ని తగ్గిస్తుంది." అని ఆర్‌బిఐ పేర్కొంది.

"భారత్‌లోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ), యుఎఇ యొక్క ఇన్‌స్టంట్ పేమెంట్ ప్లాట్‌ఫారమ్ (ఐపిపి) వంటి ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్స్ (ఎఫ్‌పిఎస్‌ఎస్) యొక్క ఏకీకరణతో సహా వివిధ అంశాలలో సహకరించడానికి కట్టుబడి ఉన్నాయి. భారతదేశం యొక్క స్ట్రక్చర్డ్ ఫైనాన్సియల్ మెసేజింగ్ సిస్టమ్ (ఎస్‌ఎఫ్‌ఎంఎస్) వంటి వారి చెల్లింపుల మెసేజింగ్ వ్యవస్థలను యుఎఇ యొక్క మెసేజింగ్ సిస్టమ్‌తో లింక్ చేసే అవకాశాన్ని అన్వేషిస్తూనే, రూపే స్విచ్, యుఎఇ స్విచ్ కనెక్ట్ చేయాలి." అని ఇరు సెంట్రల్ బ్యాంక్‌లు భావించాయి. యుపిఐ-ఐపిపి లింకేజ్ ఏ దేశంలోనైనా వినియోగదారులకు వేగంగా, సౌకర్యవంతంగా, సురక్షితంగా, ఖర్చుతో కూడుకున్న క్రాస్-బోర్డర్ ఫండ్స్ బదిలీలను చేయడానికి వీలు కల్పిస్తుంది. కార్డ్ స్విచ్‌ల అనుసంధానం దేశీయ కార్డ్‌ల పరస్పర అంగీకారాన్ని, కార్డ్ లావాదేవీల ప్రాసెసింగ్‌ను సులభతరం చేస్తుంది. మెసేజింగ్ వ్యవస్థల అనుసంధానం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక అంశాలను సులభతరం చేయడానికి ఉద్దేశించబడింది." అని ఆర్‌బిఐ పేర్కొంది.

సంపాదకీయం


భరోసా!

ఆకలి...ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాలను కాటేస్తున్న కాలసర్పం. పోషకాహార లోపం మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఒకటి. ఇది కోట్లాది మంది పిల్లలపై ప్రభావం చూపుతోంది. జీవితాలను నిశ్శబ్దంగా హరించివేస్తున్న మహమ్మారి. 'దురంత దు:ఖకర ఆకలి బాధ వర్ణింప అశక్యమే' అన్నారు. 'ఆకలి కష్టము మిక్కిలి ఎక్కువ' అని చిలకమర్తి వారు చెప్పినా, 'ఆకొన్న కూడె అమతము' అంటూ సుమతీ శతకకర్త చాటినా-సారాంశమొకటే. ఆకలి రుచి ఎరుగదన్నట్లుగా...కడుపులో పేగులు నకనకలాడుతున్న వాడికి అంబలి పోసినా... అమృతంలా ఆవురావురుమంటూ ఆరగిస్తాడు. అది కడుపు నిండినా... శరీరానికి అవసరమైన అన్ని పోషకాలను మాత్రం ఇవ్వలేదు. 'పోషకాహార లోపానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధం... మానవత్వం, న్యాయం, సమానత్వం కోసం జరిగే పోరాటం' అంటారు ఐరాస పూర్వ ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్. సైన్సు, సాంకేతికత విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ... పోషకాహార లోపం సమాజ పురోగతికి ఆటంకంగా మారింది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడవేస్తున్నది.

పోషకాహార లోపం అనేది కోట్లాది మంది వ్యక్తులను, అభివృద్ధి చెందుతున్న దేశాలలో, వారి ఎదుగుదలకు, అభివృద్ధికి, శ్రేయస్సుకు ఆటంకం కలిగిస్తోన్న ప్రపంచ సంక్షోభం. ప్రపంచవ్యాప్తంగా 240 కోట్ల మంది ప్రజలకు గతేడాది ఆహారం నిరంతరంగా లభించలేదని ఐరాస తెలిపింది. 78.3 కోట్ల మంది ప్రజలు ఆకలి బాధను ఎదుర్కొన్నారని, 14.8 కోట్ల మంది చిన్నారులు పోషకాహార లోపంతో ఎదుగుదల సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. 2023లో అంతర్జాతీయ ఆహార భద్రత, పోషకాహారంపై ఐరాసకి చెందిన ఐదు సంస్థలు ఒక నివేదికను విడుదల చేశాయి. 2021లో ప్రపంచ జనాభాలో 42 శాతం మంది అంటే 310 కోట్ల మంది ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం లభించలేదని ఆ నివేదిక పేర్కొంది. తాజా పరిశోధన ప్రకారం 2022లో తీవ్రంగా పోషకాహార లోపంతో బాధపడేవారి సంఖ్య సగటున 73.5 కోట్లుగా వుంది. '2022-స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్' రిపోర్ట్ ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా 82.8 కోట్ల మంది జనాభా తీవ్ర ఆకలి కోరలలో చిక్కుకున్నారు. ప్రతి సంవత్సరం 190 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వీరిలో 46.2 కోట్ల మంది పిల్లలు. ఈ పోషకాహార సమస్య భారత్‌లోనూ ఆందోళనకర సమస్యగా మారింది. దీనిపై తక్షణ శ్రద్ధ అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'పోషకాహార లోపం కేవలం ఆరోగ్య సంక్షోభం కాదు... ఇది ఆర్థిక సంక్షోభం. ఆర్థికవృద్ధిని అణిచివేస్తుంది, కార్మిక ఉత్పాదకతను తగ్గిస్తుంది. పేదరిక ఉచ్చులను శాశ్వతం చేస్తుంది' అంటారు బ్రిటిష్ ఆర్థికవేత్త లారెన్స్ హడిద్.

ఆరోగ్యంగా, ఆనందంగా వుండాలంటే... పౌష్టికాహారం అవసరం. పోషకాహార లోపం మానవ ఆరోగ్యం, అభివృద్ధి, సామాజిక పురోగతికి ఒక సవాలుగా మారింది. పేదరికం, ఆహార భద్రత, ప్రజారోగ్యం వంటి సంక్లిష్టమైన అంశాలతో ముడిపడి వున్నందున పోషకాహార లోపాన్ని ఎదుర్కోడానికి చేసే ప్రయత్నాలు... విస్తృతమైన అభివృద్ధి ఎజెండాగా మార్చాలి. 'పోషకాహారం కోసం పెట్టే పెట్టుబడి... మానవ సామర్థ్యాన్ని వెలికితీస్తుంది. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి వైపు నడిపిస్తుంది' అని భారతీయ ఆర్థికవేత్త రఘురామ్ రాజన్ అంటే, 'పౌష్టికాహార లోపానికి వ్యతిరేకంగా పోరాటం అంటే, కేవలం నైతిక బాధ్యత మాత్రమే కాదు... ఇది ఆర్థిక అవసరం' అంటారు కోఫీ అన్నన్. ఇది ప్రపంచ సమస్యే అయినప్పటికీ... పోషకాహార లోపం వున్న జనాభాలో దాదాపు సగం భారత్‌లోనే వుంది. దేశంలోని 20 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడాలంటే... పేదరికం, అసమానతలను తగ్గించాలి. ఆహార భద్రతను కల్పించాలి. మహాకవి శ్రీశ్రీ అన్నట్లుగా- 'మాట చేతగా మారి/ మనిషి మనిషితో చేరి/ స్వప్నం సత్యం ఐతేనే/ స్వర్గం'. ఆకలి రోగాన్ని, పోషకాహార లోపాన్ని అరికట్టడమంటే... సమాజం, వ్యక్తులు ఆరోగ్యవంతమైన జీవితాలను గడపడానికి, అభివృద్ధి పథం వైపు నడవడానికి భరోసానివ్వడమే.

మహనీయుల మాట




నేను స్వేచ్ఛను, స్వేచ్ఛాయుతమైన అభివృద్ధిని కోరుకుంటున్నా. కేవలం నా దేశానికి మాత్రమే కాదు. ప్రపంచంలో వున్న ప్రజలందరి కోసం కోరుకుంటున్నా.

- లాల్ బహదూర్ శాస్త్రి,
భారత పూర్వ ప్రధాని.

ప్రస్తుతం

అటూ ఇటూ స్వేచ్ఛకే దెబ్బ



దేశభక్తి, ప్రజా శ్రేయస్సు వంటి గంభీరోక్తులతో తీసుకొచ్చే చట్టాలు, చేసే నిర్ణయాలు ఆచరణలో ప్రజా కంటకంగా తయారవుతున్నాయి. వీటిపై పోరాటాలు చేయవలసి వస్తున్నది. అందులోనూ దేశ పౌరుల ప్రాథమిక హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛలకు అడుగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. భిన్నమైన కోణాలలో తీసుకొస్తున్న రెండు చట్టాల రూపురేఖలు కూడా ఆచరణలో ప్రజాస్వేచ్ఛకు, హక్కులకు భంగకరంగా మారడం ఈ క్రమంలో తాజా పరిణామం. మొదటే చెప్పినట్టు అసలు ఉద్దేశం కుట్రపూరితం గనక జరుగుతున్న విపరీతమిది, ఈ రెండు చట్టాలు కూడా ప్రజా రక్షణ, స్వేచ్ఛ పేరుతోనే తీసుకురావడం మరింత విపరీతం. ఇందులో ఒకటి డిపిడిపి అనే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ 2023. మరొకటి ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సియు) ముసాయిదా. వీటిపై న్యాయస్థానాలు, న్యాయమూర్తులే ఆందోళన వెలిబుచ్చుతున్న పరిస్థితి.



తెలకపల్లి రవి

వేమన అన్నట్టు చిత్తశుద్ధి లేకుండా చేసే పని ఏదైనా పక్కదోవ పట్టడం తప్పనిసరి. మరీ ముఖ్యంగా దేశాన్ని పాలించే ప్రభుత్వాధినేతల విషయంలో ఇది మరింత సత్యం. విధానాలు, చట్టాల రూపకల్పనలో మౌలికంగా ఉద్దేశం మంచిదైతే ఫలితం ఉపయోగకరంగా వుంటుంది. భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతుంది. దుర్నీతితో వ్యవహరిస్తే చెప్పేదొకటి చేసేదొకటిగా పరిణమిస్తుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో చాలాసార్లు ప్రకటిత లక్ష్యాలకు, కనిపించే ప్రభావాలకు పొంతన లేకుండా పోవడం రివాజుగా మారింది. దేశభక్తి, ప్రజా శ్రేయస్సు వంటి గంభీరోక్తులతో తీసుకొచ్చే చట్టాలు, చేసే నిర్ణయాలు ఆచరణలో ప్రజా కంటకంగా తయారవుతున్నాయి. వీటిపై పోరాటాలు చేయవలసి వస్తున్నది. అందులోనూ దేశ పౌరుల ప్రాథమిక హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛలకు అడుగడుగునా ఆటంకాలు తప్పడం లేదు. భిన్నమైన కోణాలలో తీసుకొస్తున్న రెండు చట్టాల రూపురేఖలు కూడా ఆచరణలో ప్రజాస్వేచ్ఛకు, హక్కులకు భంగకరంగా మారడం ఈ క్రమంలో తాజా పరిణామం. మొదటే చెప్పినట్టు అసలు ఉద్దేశం కుట్రపూరితం గనక జరుగుతున్న విపరీతమిది, ఈ రెండు చట్టాలు కూడా ప్రజా రక్షణ, స్వేచ్ఛ పేరుతోనే తీసుకురావడం మరింత విపరీతం. ఇందులో ఒకటి డిపిడిపి అనే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ 2023. మరొకటి ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సియు) ముసాయిదా. వీటిపై న్యాయస్థానాలు, న్యాయమూర్తులే ఆందోళన వెలిబుచ్చుతున్న పరిస్థితి.

డేటా పరిరక్షణ సవాలు

ముందు డేటా పరిరక్షణ చట్టం తీసుకుందాం. ఇదిప్పుడు అంతర్జాతీయ సమస్య. మామూలు మనుషుల నుంచి ప్రముఖుల వరకూ ప్రతిఒక్కరి వ్యక్తిగత వివరాలు చిన్న చిన్న అంశాలతో సహా డేటా అపహరించబడుతున్నది. మనం ఒక చొక్కా కొంటే వెంటనే మనకు మరిన్ని బ్రాండ్ల చొక్కాల గురించి సమాచారం వచ్చేస్తుంది. మనం యూ ట్యూబ్‌లో ఒక వీడియో చూస్తే మరుక్షణంలో అలాంటి వీడియోలే వరుసగా వచ్చేస్తున్నాయి. ఒక బ్యాంకులో రుణం కోసం ప్రయత్నిస్తే మేము అప్పిస్తామంటూ మరిన్ని సందేశాలు. ఒక రోజు టికెట్ బుక్ చేసుకుంటే వెంటనే దానికి సంబంధించిన మెసేజ్‌లు. మందుల గురించీ. ఇళ్ల గురించి ఒకటేమిటి.. రాజకీయంగానూ మీ భావాలను బట్టి సందేశాలు. కొన్నిసార్లు ఫోన్‌కాల్స్, ఇదంతా ఎలా జరుగుతుంది? బిగ్ డేటా చౌర్యం వల్లనే, ఆధార్ కార్డు సమాచారం అమ్ముతామని బేరాలు పెట్టి దొరికిపోయిన వారి గురించి చూశామంటే ఈ కారణం వల్లనే, పెగాసస్ మాల్‌వేర్ గురించిన కథనాలు కొంతకాలం కిందట ప్రపంచ వ్యాపితంగా సంచలనమయ్యాయి. దానిపై సుప్రీంకోర్టు విచారణ జరిపి వేసిన కమిటీ ఏదో సాంకేతికమైన నివేదిక ఇచ్చి ముగించింది. ప్రభుత్వం నేరుగా చెప్పకుండా తప్పించుకుంది. పాత్రికేయులు, మీడియా వ్యక్తులు, ప్రతిపక్ష నాయకుల డేటా పైన నిఘా వేసేందుకే ఇజ్రాయిల్ దగ్గర పెగాసస్ కొన్నట్టు వెల్లడైంది. చివరకు ఇది ఆ దేశ పార్లమెంటులోనూ రభసకు దారితీసింది, ఈ డేటాతో ఎన్నికల మార్కెటింగ్ సంస్థలు, వాణిజ్య సంస్థలు, వివిధ రకాల సేవలందించే సంస్థలు మన వివరాలు తెలుసుకుంటున్నాయనేది అందరికీ అనుభవమే. సోషల్ మీడియాలో పాలక పార్టీలు వాటితో యుద్ధం చేసుకుంటాయి. అయితే ఈ క్రమంలో పౌరుల వ్యక్తిగత వివరాలు కూడా బహిర్గతమై గోప్యత అంటూ లేకపోవడం అభద్రతకు కారణమైంది. దాంతో డేటా పరిరక్షణ బిల్లు ముసాయిదా రూపొందించడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్ శ్రీకృష్ణ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది (ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యపై కమిటీకి ఈయనే నాయకత్వం వహించారు). ఈ కమిటీ అనేక సూచనలు, సిఫార్సులు చేసింది. 2018లో వారు తమ నివేదిక సమర్పించారు. దానిపై విస్తారమైన చర్చ జరిగింది. కాని ప్రభుత్వం అమలుకు చర్యలు తీసుకోలేదు. తర్వాత దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపారు. ఈ లోగా పెగాసస్ వంటి సంచలనాలు బయటకు వచ్చాయి. ఆ సమయంలో జస్టిస్ శ్రీకృష్ణ మాట్లాడుతూ డేటా పరిరక్షణ బిల్లు గనక అమలు చేసి వుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ఎందుకంటే డేటా పరిరక్షణకు అందులో ఒక పటిష్టమైన యంత్రాంగాన్ని, కొన్ని పద్ధతులను ప్రతిపాదించారు.

ప్రాథమిక హక్కులకే భంగం

చాలా కాలం గడిచిన తర్వాత ఇప్పుడు ప్రభుత్వం డిపిడిపి పేరిట ఈ బిల్లు ముసాయిదా విడుదల చేసింది. ఈ నెలలో మొదలయ్యే పార్లమెంటు సమావేశాలలో దీన్ని ప్రవేశపెడతారని భావిస్తున్నారు. సామాన్య పౌరులు కూడా తమ డేటా ఎవరో సంగ్రహించారని అనుమానం కలిగితే నిపుణుల కమిటీకి ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నది. కాని ఇందులో ప్రభుత్వానికి మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా చేసింది. దీనిపై అనేక అభ్యంతరాలు, అనుమానాలు వచ్చాయి. మరెవరో కాకుండా సాక్షాత్తూ జస్టిస్ శ్రీకృష్ణ తీవ్ర విమర్శ చేశారు. ఈ బిల్లు వ్యక్తిగత, ఆంతరంగిక డేటాలో ప్రభుత్వం తల దూర్చడానికి ఎక్కడ లేని అవకాశమిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రభుత్వ సంస్థల జోక్యానికి మినహాయింపు ఇవ్వడం చాలా ఆందోళన కలిగిస్తున్నది, ఇందులో డేటా గోప్యతకు సంబంధించి వ్యక్తుల స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కుకు రక్షణ ఇవ్వడం కంటే ప్రభుత్వ విశృంఖల జోక్యానికి అవకాశమే ఎక్కువగా వుందని ఆయన న్నారు. ఈ యంత్రాంగానికి బాధ్యుడుగా నియమించబడే అధికారి ప్రభుత్వ కీలుబొమ్మలా వుండాల్సిందే. 2018 ముసా యిదాలో మేము క్రియాశీలమైన స్వతంత్రమైన నియంత్రణా ధికారి వుండాలని ప్రతిపాదించాము. కాని ఇందులో వారి అర్హత, పదవీ కాలం ప్రతిదీ ప్రభుత్వ నిర్ణయం మేరకే జరగాల్సి వుంటుంది. ఇది గత బిల్లుకన్నా దారుణంగా వుంటుంది అని స్పష్టం చేశారు. ఏదైనా నేరాన్ని లేదా చట్ట వుల్లంఘనను అడ్డుకోవడానికి, దర్యాప్తు చేయడానికి అవసరమైన సందర్భాల్లో ఈ చట్టం వర్తించదు. న్యాయస్థానంలో ట్రిబ్యునల్‌లో లేదా మరేదైనా న్యాయ సంబంధమైన వ్యవహారంలో కూడా డేటా తీసుకోవచ్చునని వెసులుబాటు కల్పిస్తున్నది. ఇంతా చేసి ఒకవేళ ఏదైనా ఉల్లంఘన జరిగితే జరిమానా 500 రూపాయలు మాత్రమేనట!

సర్కారు చెప్పేదే సత్యమా?

ఇది స్వయంగా ముంబాయి హైకోర్టుకు వచ్చిన సందేహం. మీడియాలో సోషల్ మీడియాలో ఫేక్ వార్తలను నియంత్రించే పేరిట ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఫ్యాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సియు) ఏర్పాటు చేసేందుకు అధికారమిస్తున్న నిబంధనపై హైకోర్టు విచారణ చేపట్టింది. సోషల్ మీడియా ఇంతగా విస్తరించక ముందు ఇన్ఫర్మేషన్ చట్టం 2000 సెక్షన్ 69(1) పనిచేస్తూ వచ్చింది. మారిన పరిస్థితులలో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు పిఐబి కమిటీని వేశారు. 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. వాటి ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో వున్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు, కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరు నెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో వుండవని సుప్రీంకోర్టు ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదాలో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. పైకి చెప్పడానికి ఆన్‌లైన్ గేమింగ్ నిరోధించడానికి ఈ చట్టం తెచ్చామన్నారు. కానీ సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటి వాటిలో వచ్చిన వార్తా కథనాలు (కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి వుంటుందని ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి వుంటుంది. కాని ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి? ఇదే ప్రశ్న హైకోర్టు అడిగింది. మీరు చెప్పిందే సత్యమా? సత్యానికి ప్రభుత్వం గుత్తాధిపత్యం కలిగివుందా అని నిలదీశారు న్యాయమూర్తి గౌతం పటేల్. భిన్నాభిప్రాయాలు వస్తే వివరణ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. అంతేగాని నిజానిజాలను, భిన్న విధానాలు-విలువలను నిర్ధారించే అధికారం రాజ్యాంగం ఇవ్వడం లేదు. ఇప్పుడు ఎన్నికలు రాబోతున్నాయి. నచ్చని పార్టీల అభిప్రాయాలను అడ్డుకున్న ఉదాహరణలు గతంలో వున్నాయి. ఆ ప్రకటనలు సరైనవి కావని ఎవరైనా ఎడిటర్ నిర్ధారణ చేసి వాటిని ఆపితే మీ ఫ్యాక్ట్ కమిటీ ఆ నిర్ధారణను తోసిపుచ్చవచ్చు కదా. అప్పుడేమవుతుంది? అని జస్టిస్ పటేల్ ప్రశ్నించారు. చీమను చంపడానికి సుత్తిని తీసుకొస్తారా అని ఆయన వేసిన ప్రశ్న సహజంగానే పత్రికలలో ప్రముఖ స్థానమాక్రమించింది. విచారణకు హాజరైన మీడియా సంస్థల తరపు న్యాయవాది కూడా ఇది స్వేచ్ఛకు భంగకరమైన ఆలోచన అని గట్టిగా వాదించారు. ప్రభుత్వం తరపు న్యాయవాది సమర్థనకు తంటాలు పడ్డారు. సొలిసిటర్ జనరల్ కూడా పాల్గొనబోతున్నారు.

గతంలో జరిగిందేమిటి?

ఈ చర్చ ఇంత లోతుగా జరగడానికి బలమైన కారణాలున్నాయి. గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా వుంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు బూటకమని ప్రకటించింది. కాని దాని ప్రకటనలే అవాస్తవాలని తేలింది. 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం (ఐ.బి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో ఆర్ణబ్ గోస్వామి వంటివారు వలస కార్మికులు తరలిపోతున్న ఫోటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే వుంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లిగీ జమాయత్ మర్కజ్ సంస్థలో ఏమి జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహ చేసిన వ్యాఖ్యలు, ప్రకటనలు ఎలా వున్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటనలోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫోటోలు మార్ఫింగ్ ఫోటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమైనాయి (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాలలోనూ వున్నాయి. వాటిలోకి వెళితే ఎవరు, ఏమిటి అన్నది మరో వివాదమవుతుంది). విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. హైకోర్టు అడిగినట్టు తాము చెప్పిందే సత్యమని, తమ తప్పులను విమర్శించేదంతా అసత్యమని పిఐబి ద్వారా కేంద్రం నియంత్రణ చేయడం అనుమతించరానిది. ఎన్నికల సమయంలో మరీ ప్రమాదం. ఈ కేసు విచారణ సరైన తీర్పుకు దారితీస్తుందని ఆశించాలి. కనుక డేటా రక్షణ అన్నా సత్యశోధన అన్నా జరిగేది మాత్రం స్వేచ్ఛకు ఎసరు పెట్టడమే. అందుకు వ్యతిరేకంగా పోరాడితేనే ప్రజాస్వామ్యం వ్యక్తిగత గోప్యత, భావప్రకటనా స్వేచ్ఛ కాపాడుకోగలం. ★

సమస్య

ఆటో డ్రైవర్లను ఆదుకోరే!

మన రాష్ట్రంలో దాదాపు 12,64,000 పైగా ఆటోలు ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఒక్కో ఆటోకు ఇద్దరు డ్రైవర్ల చొప్పున దాదాపు 25 లక్షల మంది ఉన్నారు. ఉదాహరణకు 2022 సంవత్సరంలో వాహన మిత్ర లబ్ధిదారుల సంఖ్య 2 లక్షల 61 వేలు మాత్రమే. ఈ లెక్కన లబ్ధి పొందిన వారు 15 శాతం మించలేదు. ఉద్యోగ కల్పన పేరుతో కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాలు కేటాయించే ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లకు ఉండేందుకు గృహ వసతి కల్పించకపోవడం అత్యంత దారుణం. లక్షల మందికి ఉపాధి కల్పించే ఆటో రిక్షా రంగానికి ప్రభుత్వం అందించే సాయం గుండు సున్నా.





జె. గోపి

రవాణా రంగంలో అత్యధిక మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న వారిలో ఆటో రిక్షా డ్రైవర్లది కీలక స్థానం. అయినా కూడా "దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు" చందంగా వారి బతుకులున్నాయి. ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగాలు రాక, ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించక ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి పొందుతున్నారు. నేడు గ్రామాలు, పట్టణాలలో నిరుద్యోగం పెరగడం, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చాలా మంది నిరుద్యోగులు ఆటో డ్రైవర్లుగా బతుకుతున్నారు. మారుమూల గ్రామాల నుండి పట్టణాలకు సమయంతో నిమిత్తం లేకుండా రాత్రి, పగలు ప్రయాణికులకు సేవలందిస్తూ అరకొర ఆదాయాలతో జీవనం సాగిస్తున్నారు.

ఆటోల కొనుగోలుకు గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను బ్యాంకుల నుండి ప్రభుత్వం అందించేది. ప్రస్తుతం ప్రభుత్వము, బ్యాంకుల ద్వారా ఎటువంటి ఆర్థిక సహాయం అందడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పు చేస్తున్నారు. ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలకు అధిక వడ్డీలు చెల్లించలేక అనేక అవస్థలు పడుతున్నారు. ఒక ఆటో ఖరీదు రూ.3,00,000 దాటిపోవడంతో ఫైనాన్స్ వడ్డీలు, కిస్తీలు మరింత భారంగా తయారయ్యాయి. కిస్తీలు పెండింగ్ ఉన్నాయని ఎటువంటి నోటీసులు గాని, చట్టబద్ధ నిబంధనలను పాటించకుండా దౌర్జన్యంగా ఆటోలను స్వాధీనం చేసుకొని, అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఫైనాన్సు కంపెనీలను అదుపు చేసే చట్టాలున్నా వాటి పట్ల ఆటో డ్రైవర్లకు సరైన అవగాహన లేకపోవడంతో జీవనోపాధిని కోల్పోతున్నారు. తద్వారా వారి కుటుంబాలు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోతున్నాయి.

ఆటో డ్రైవర్లు రోజుకి 12 గంటలు పనిచేసినా రూ.600 నుండి రూ.800 వరకు మాత్రమే సంపాదించగలుగుతున్నారు. ఇందులో ఫైనాన్స్ కిస్తీలకు రూ.300 మినహాయిస్తే ఇంధనం ఖర్చు రూ.300 వుంటుంది. అన్ని ఖర్చులూ పోను రూ.200 నుండి రూ.300 మాత్రమే ఇంటికి చేరుతోంది. దీనికితోడు పోలీసులు విధించే చలానాలు కట్టాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

ప్రమాదాలు జరిగినా కుటుంబంలో ఎవరైనా అనారోగ్యం పాలైనా వడ్డీలకు అప్పు చేసి వైద్యం చేయించడం తప్ప ఇఎస్ఐ సౌకర్యం కూడా లేదు. పిల్లల చదువుల నుండి పెళ్లిళ్ల వరకు ఏ కార్యక్రమానికైనా అప్పులు చేయాల్సిందే. సంవత్సరానికి ఒక్కసారి కూడా కొత్త బట్టలు కొనుక్కోలేని దయనీయ పరిస్థితి నెలకొన్నది. కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ స్వయం ఉపాధి పొందుతున్న రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వ సహాయం ఎండమావిగా తయారైంది. రవాణా రంగంలో మిగిలిన వాహనాల డ్రైవర్లందరితో కలిపి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని....46వ లేబర్ కమిషన్ సిఫార్సు చేసినప్పటికీ... తెలుగు రాష్ట్రాలలో నేటికీ సంక్షేమ బోర్డు ఊసే లేదు.

కరోనా కాలంలోను, ఆ తర్వాత కిరాయిలు లేక కుటుంబ పోషణ కష్టమై తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ మరింత భారాలను మోపాయి. రిజిస్ట్రేషన్ చార్జీలు, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ చార్జీల పెంపు, స్పేర్ పార్ట్స్ (విడిభాగాల)పై జి.ఎస్.టి పేరుతో కోట్లాది రూపాయలు ప్రభుత్వాలకు సంపాదించి పెడుతున్నా కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఆటో డ్రైవర్లపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కనీసం ఆటోలను నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలాలను కూడా కేటాయించక పోవడంతో ఆటోవాలాలు తమ రోజువారీ సంపాదనలో అధిక భాగం పోలీసులు విధించే 'నో పార్కింగ్' చలానాలకు చెల్లించాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రవాణా రంగ చట్ట సవరణ ఫలితంగా వాహనాలపై విధించే ఫైన్లు అనేక రెట్లు పెరిగిపోయాయి. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా, సింగిల్ ఓనర్లను నష్టాలుపాలు చేసేలా, కేంద్ర ప్రభుత్వం రవాణా రంగ చట్ట సవరణ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్ట సవరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన జీవో నెంబర్ 21 ఆటో డ్రైవర్లకు ఉరితాడులా తయారైంది.

ఒకపక్క పోలీసులు మరోవైపు ఆర్టీవో ఆఫీసులో ఏజెంట్ల వేధింపులు మరింత భారంగా మారాయి. పేరుకి ఏజెంట్ల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసినా, ఆర్టీవో ఆఫీసుల్లో ఏజెంట్లు లేకుండా నేరుగా వెళ్లిన వారికి అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. రూ. 450 ఉన్న రిజిస్ట్రేషన్‌కు రూ.1200 వసూలు చేస్తున్నారని, రూ. 660 ఉన్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ కోసం రూ. 2000 చెల్లిస్తున్నామని, రూ. 600 ఉన్న పర్మిట్ ఫీజును రూ. 1000 ఏజెంట్లకు ఇవ్వకుంటే పని జరగడం లేదని, ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే ఆటో రిక్షా రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఆటో డ్రైవర్లు నిత్యం రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నారని, అటువంటి సమయంలో సరైన వైద్యం అందక, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

సంక్షేమ పథకాలను తనకంటే ఎక్కువగా ఎవరూ అందించడం లేదని గొప్పగా చెప్పుకునే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి వాహనమిత్ర పథకాన్ని కొద్ది మంది ఓనర్లకు ఇచ్చి ఆటో రిక్షా డ్రైవర్లందరికీ ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారు. మన రాష్ట్రంలో దాదాపు 12,64,000 పైగా ఆటోలు ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఒక్కో ఆటోకు ఇద్దరు డ్రైవర్ల చొప్పున దాదాపు 25 లక్షల మంది ఉన్నారు. ఉదాహరణకు 2022 సంవత్సరంలో వాహన మిత్ర లబ్ధిదారుల సంఖ్య 2 లక్షల 61 వేలు మాత్రమే. ఈ లెక్కన లబ్ధి పొందిన వారు 15 శాతం మించలేదు. ఉద్యోగ కల్పన పేరుతో కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాలు కేటాయించే ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లకు ఉండేందుకు గృహ వసతి కల్పించకపోవడం అత్యంత దారుణం. లక్షల మందికి ఉపాధి కల్పించే ఆటో రిక్షా రంగానికి ప్రభుత్వం అందించే సాయం గుండు సున్నా.

ఉద్యోగాల కల్పన పేరుతో, కార్పోరేట్లకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, స్వయం ఉపాధి పొందుతున్న ఆటో రిక్షా కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎటువంటి సామాజిక భద్రత లేని ఆటో డ్రైవర్ల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.

/ వ్యాసకర్త ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి (సి.ఐ.టి.యు.), సెల్: 9948049554 /

★

సందర్భం

కారంచేడు ఘటనకు 38 ఏళ్లు



ఆధిపత్య కులాల దురహంకారాన్ని, దౌర్జన్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన ఘటన కారంచేడు మారణహోమం. ఈ నరమేధంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది క్షతగాత్రులయ్యారు. తర్వాత కొడుకు హత్యకు ప్రత్యక్ష సాక్షి అయినందుకు దుడ్డు ఆలీసమ్మను విష ప్రయోగంతో హత్య చేశారు. నేటికీ బాధితులు ఆశించిన స్థాయిలో నేరస్తులకు శిక్షలు పడలేదు. ఆనాడు జరిగిన అన్యాయాన్ని దినపత్రికలు పతాక శీర్షికలతో ప్రపంచానికి తెలియజేశాయి. ఎంతోమంది కవులు, కళాకారులు, ఉద్యమకారులు, సామాజికవేత్తలు...కారంచేడు ఘటనను తమ ఆటపాటల ద్వారా ఈ సమాజానికి తెలియజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపారు. ఆనాటి పోరాటాల నుంచి నిత్యం స్ఫూర్తి పొంది దేశంలోని దళితులందరూ ఏటా జులై 17వ తేదీన "కారంచేడు మృతవీరుల సంస్మరణ' దినంగా జరుపుతుంటారు. కారంచేడు ఉద్యమం దేశంలో అనేక చట్టాల రూపకల్పనకు ప్రేరణగా నిలిచింది. 1989 ఎస్సీ/ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్టు (అత్యాచారాల నిరోధక చట్టం) రావడానికి కారణమైంది. 1991లో జరిగిన చుండూరు నరమేధం ఘటనలో ప్రత్యేక కోర్టును ఘటన జరిగిన ఊరిలోనే ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటివరకు హరిజనులుగా, ఎస్సీలుగా పిలువబడుతున్న వారిని దళిత, బహుజన అనే చైతన్యవంతమైన పదాల్ని ప్రజలకి పరిచయం చేసింది కారంచేడు ఉద్యమం. దళితుల సంక్షేమ చట్టాల రూపకల్పనలో కారంచేడు ఘటన ప్రభుత్వాలకు ఒక రిఫరెన్సులా నేటికీ ఉపయోగపడుతుంది. కారంచేడు మృతవీరులు అందించిన స్ఫూర్తితో దళిత బహుజన సమాజం ముందుకు నడవాలని ఆశిస్తూ మృతవీరులకు జోహార్లు.

- డా॥ మున్నంగి నాగరాజు, కారంచేడు బాధితుడు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు దిగ్గజం

ఎన్ శంకరయ్య @ 102 వసంతాలు

- ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభృతుల శుభాకాంక్షలు
- మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్


శంకరయ్యకు 102వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న జి రామకృష్ణన్, కె బాలకృష్ణన్

చెన్నయ్ : స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు దిగ్గజ నేత ఎన్ శంకరయ్య 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం ఎన్ శంకరయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనుందని ఈ సందర్భంగా స్టాలిన్ ప్రకటించారు. మదురైలోని అమెరికన్ కాలేజీలో శంకరయ్య చదువుకున్నారని, అయితే ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేయడంతో పరీక్షలు రాయలేకపోయారని స్టాలిన్ తెలిపారు. తమిళుల సమాజోద్ధరణకు, పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం నిర్విరామంగా కృషి చేస్తున్న శంకరయ్యకు గౌరవ డాక్టర్ అందజేయాలని ప్రజల నుంచి తమకు ఎన్నో వినతులు వచ్చాయని, వారి ఆకాంక్షలను గౌరవించి శంకరయ్యకు మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు స్టాలిన్ తెలిపారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్, ఆ పార్టీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్ కూడా శంకరయ్య నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
సిపిఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ శంకరయ్యను మదురైలోని అమెరికన్ కాలేజీలో ఆఖరి సంవత్సరం విద్యార్థిగా ఉండగానే 1941లో తొలిసారి అరెస్టు చేశారు. భారతావని స్వాతంత్రం సాధించుకున్న 1947 ఆగస్టు 15కు 12 గంటల ముందు మాత్రమే ఆయనను విడుదల చేశారు. ఎనిమిదేళ్ల జైలు జీవితంతో పాటు దాదాపు ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘకాలంగా శంకరయ్య రాజకీయ రంగంలో సేవలందిస్తూవున్నారు. 1967, 1977, 1980 ఎన్నికల్లో ఆయన తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2021లో శత వసంతాలు పూర్తి చేసుకున్న శంకరన్‌కు తమిళనాడు ప్రభుత్వం 'థగైసాల్ తమిళ్' పురస్కారాన్ని ప్రకటించి గౌరవించింది. పురస్కారం కింద రూ.10 లక్షల నగదు, జ్ఞాపిక అందజేసి సంత్కరించింది. అయితే శంకరయ్య ఆ నగదు మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు.

'మణిపూర్' సమస్య మరింత జటిలం

ప్రత్యేక రాష్ట్రం కోసం కుకీల పట్టు

ఇంఫాల్ : మణిపూర్‌లో గత 70 రోజులుగా కొనసాగుతున్న హింసాకాండకు ఇప్పుడప్పుడే శుభం కార్డు పడేటట్లు కన్పించడం లేదు. కాగా సమస్య మరింత జటిలమవుతోంది. ఇప్పటి వరకూ తమకు ప్రత్యేక పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చిన కుకీ తెగ వారు ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. కుకీ గిరిజనులకు చెందిన అత్యున్నత సంస్థ కుకీ ఇన్పీ మణిపూర్ (కేఐఎం) రెండు రోజుల క్రితం సమావేశమైంది. రాజ్యాంగంలోని మూడవ అధికరణ ప్రకారం తమకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్ చేసింది. తమకు, మైతీలకు మధ్య చిరకాలంగా కొనసాగుతున్న విభేదాలను పరిష్కరించడం ఇక సాధ్యం కాదని తెగేసి చెప్పింది. కాగా హింసాకాండ చెలరేగిన తొలి రోజులలో కుకీ-జోమీ తెగ వారు లేవనెత్తిన డిమాండ్‌కు ప్రస్తుత వైఖరి పూర్తి భిన్నంగా ఉంది. తమ తెగ వారు అధికంగా నివసిస్తున్న ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అప్పుడు జోమీలు డిమాండ్ చేశారు. అయితే కుకీలు, మైతీలు సహజీవనం సాగించడం అసాధ్యమని స్పష్టమైపోయిందని, పైగా ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటుపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కేఐఎం ప్రతినిధి తంగ్‌మిలెన్ కిప్‌జెన్ చెప్పారు. ఇప్పుడు బలమైన ఓ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన తెలిపారు.

పోరాట కేంద్రాల్లో ఎగిరిన ఎర్రజెండా

- ఐదు స్థానాల్లో మూటింట గెలుపు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వామపక్షాలు గతంతో పోలిస్తే బాగా పుంజుకున్నాయి. పోరాటాల కేంద్రంగా నిలిచిన పంచమి హటగఛ బొగ్గు క్షేత్రం (పిహెచ్‌సిబి) పరిధిలో ఎర్రజెండా రెపరెపలాడింది. పిహెచ్‌సిబి పరిధిలో ఆదివాసీలకు కేటాయించిన మొత్తం 5 గ్రామ పంచాయితీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు 3 స్థానాల్లో విజయం సాధించారు. అలాగే మరో పోరాట క్షేత్రమైన భర్కత గ్రామ పంచాయత్‌లో 17 స్థానాలకు గాను 6 స్థానాల్లో సిపిఎం గెలుపొందింది. పాలకపక్షాలు ఎన్ని కుతంత్రాలకు పాల్పడినా ఐక్య ప్రజా పోరాటాలదే అంతిమ విజయమని సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా ప్రజలకు అభినందనలు తెలిపింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఆ పార్టీ ఒక పోస్టు చేసింది.

కూర'గాయాల'కు ముస్లింలే కారణమట!

- అస్సాం సిఎం బిశ్వశర్మ వితండవాదం

గౌహతి : రాష్ట్రంలో కూరగాయల ధరలు పెరగడానికి మియా ముస్లిం వ్యాపారులే కారణమంటూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కూరగాయలు ఎక్కువగా విక్రయించేది మియా ముస్లింలేనని అంటూ ఒకవేళ అస్సాం ప్రజలు వాటిని అమ్మితే వారు తమ ప్రజల నుండి ఎక్కువ ధరలు వసూలు చేయరని ఆయన చెప్పుకొచ్చారు. 'గ్రామీణ ప్రాంతాలలో రైతులు విక్రయించే కూరగాయల ధరలు ఎక్కువగా లేవు. అయితే అవే కూరగాయలను గ్రామాల నుండి కొనుగోలు చేసి గౌహతికి తీసుకొచ్చి అమ్మితే ధరలు పెరిగిపోతున్నాయి. కూరగాయలను అధిక ధరలకు అమ్మే వారు ఎవరు? వారు మియా వ్యాపారులు. వారే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు' అని తెలిపారు. తూర్పు బెంగాల్ మూలాలు ఉన్న ముస్లింలను మియా ముస్లింలు అని పిలుస్తారు. అస్సాం ప్రజల నుండి వారు ఎక్కువ రేటు వసూలు చేస్తున్నారని, గౌహతిలో స్థానిక కూరగాయల మార్కెట్లపై మియాలు పెత్తనం చెలాయిస్తున్నారని బిశ్వశర్మ ఆరోపించారు.

బిశ్వశర్మ వ్యాఖ్యలపై ఎంపీ, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. 'ఇలాంటి వారు తమ ఇంటిలో గేదె పాలు ఇవ్వకపోయినా, కోడి గుడ్డు పెట్టకపోయినా మియాలే కారణమని నిందలు వేస్తుంటారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇతరులపై నెపం మోపుతారు' అని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీపై కూడా ఆయన విమర్శలు సంధిస్తూ ప్రధానికి, విదేశీ ముస్లింలకు మధ్య గాఢమైన స్నేహం ఉన్నదని అంటూ వారిని అడిగి టమాటాలు, బంగాళదుంపలు వంటి కూరగాయలను తెప్పించుకోవాలని హితవు పలికారు. బిశ్వశర్మ వ్యాఖ్యలపై ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) అధ్యక్షుడు, ఎంపీ బద్రుద్దీన్ అజ్మల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లింలు, అస్సాం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బిశ్వశర్మ ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

కాలుష్యంపై కలసికట్టుగా పోరాడాలి

- ఐరాస వాతావరణ చర్చల చీఫ్ పిలుపు

బ్రస్సెల్స్ : ప్రపంచంలోని అన్ని ప్రాంతాలు, రంగాల్లో కాలుష్యకారక వాయువులను తగ్గించడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ సమస్యను పరిష్కరించాలని ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి వాతావరణ చర్చల విభాగ అధిపతి సుల్తాన్ అల్ జబర్ ప్రభుత్వాలకు, వ్యాపార వాణిజ్య సంస్థలకు పిలుపునిచ్చారు. ఏడేళ్ల క్రితం ఆమోదించిన కీలకమైన ఉష్ణోగ్రత పరిమితిని దాటకుండా భూగోళాన్ని నిలువరించాలని ప్రపంచ నేతలు కోరుకున్నట్లైతే తక్షణమే అత్యవసర చర్యలు చేపట్టాల్సి వుందని అన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన జబర్ ఆ దేశంలోని ప్రభుత్వ రంగ చమురు కంపెనీల్లో ఒకదానికి నాయకత్వం వహిస్తున్నారు. బ్రస్సెల్స్‌లో సమావేశమైన యూరప్, కెనడా, చైనాలకు చెందిన అధికారులతో ఆయన మాట్లాడారు. ఇటీవలి కాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాటిని పరిశీలిస్తే అత్యవసర చర్యల ఆవశ్యకత తెలుస్తుందన్నారు. దుబాయిలో త్వరలో జరగాల్సిన కాప్-28 అంతర్జాతీయ వాణిజ్య చర్చలకు అనుసరించాల్సిన వ్యూహాన్ని వివరించారు. ఉష్ణోగ్రతల్లో పెరుగుదలకు కారణాలు ఏమిటి, వాటిని మరింత పెరగకుండా చూసేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటనే అంశాల్లో నేతలు అత్యంత నిజాయితీగా వ్యవహరించాల్సి వుందన్నారు. అన్ని చోట్లా అన్ని రకాల కాలుష్యాలను అరికట్టాల్సిన అవసరం వుందని స్పష్టం చేశారు. 2015 పారిస్ వాతావరణ ఒప్పందానికి అనుగుణంగా గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం చేసేందుకు ఒక ఆచరణాత్మక ప్రణాళికను రూపొందించేందుకు ప్రభుత్వాలను, ప్రధాన ఇంధన ఉత్పత్తిదారులను, భారీగా కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఒక చోటకు తీసుకురావాలని యోచిస్తున్నట్లు చెప్పారు.

బ్రెజిల్‌లో మోర్ డాక్టర్స్ ప్రోగ్రామ్ పునరుద్ధరణ !

- త్వరలో 15వేల మంది డాక్టర్ల నియామకం



బ్రసీలియా : బ్రెజిల్‌లో మోర్ డాక్టర్స్ ప్రోగ్రామ్‌ను పునరుద్ధరించే బిల్లుకు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా శుక్రవారం ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టంగా మారింది. ప్రజారోగ్య సంరక్షణను విస్తరించేందుకు ఇప్పుడున్న డాక్టర్ల సంఖ్యను రెట్టింపు చేయడం ఈ కార్యక్రమం ప్రధానోద్దేశం. యునిఫైడ్ హెల్త్ సిస్టమ్ (ఎస్‌యుఎస్) ప్రాథమిక సంరక్షణ రంగంలో ప్రధానంగా అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్ల సంఖ్యను పెంచాలని కార్యక్రమం కోరుతోంది. ఎస్‌యుఎస్ అనేది ఉత్తమమైన ప్రజారోగ్య వ్యవస్థ అని లూలా వ్యాఖ్యానించారు. ప్లానాల్టో ప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యానికి కేటాయించే డబ్బును ఒక ఖర్చుగా చూడకూదని, ఒక పెట్టుబడిగా చూడాలని లూలా వ్యాఖ్యానించారు. ఆరోగ్య నిపుణులు, స్పెషలిస్టుల సేవలందుకునే ప్రజల హక్కు నిరాకరించబడుతోందని అంటూ వాస్తవానికి ఈ మోర్ డాక్టర్స్ కార్యక్రమం దేశంలోని అత్యంత సుదూర ప్రాంతాలను కలుపుతోందని లూలా అన్నారు. ఈ కార్యక్రమాన్ని పునరుద్ధరించడం ఈ దేశం కోసం తీసుకున్న అసాధారణ చర్యగా ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా ఎస్‌యుఎస్ పట్ల సందేహాలు వున్నట్లైతే కరోనా సమయంలో మన వైద్య రంగ నిపుణులు అందించిన సేవలు చూడాలని ఆయన సూచించారు. ఎస్‌యుఎస్ ప్రాథమిక సంరక్షణలో 15వేలమంది డాక్టర్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం 13వేలుగా వున్న సంఖ్యను 28వేలకు పెంచుతున్నారు. వీరు దాదాపు 9.6కోట్ల మంది ప్రజలకు సేవలందిస్తారు. దేశంలోనే శిక్షణ పొందిన డాక్టర్లకు ఈ కార్యక్రమంలో మొదటగా ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఒకవేళ అవసరమనుకుంటే ఇతర దేశాల నుండి నిపుణులను తీసుకుంటామని లూలా చెప్పారు. 2013లో అప్పటి అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ ఈ మోర్ డాక్టర్స్ ప్రోగ్రామ్‌ను అమలు చేశారు. పెద్ద నగరాల నుండి చిన్న పట్టణాలు, పల్లెల వరకు వైద్య నిపుణును తీసుకురావడమే ఈ పథకం లక్ష్యంగా వుంది.

వెస్ట్ బ్యాంక్‌ను బహిరంగ జైలుగా మార్చిన ఇజ్రాయిల్

పాలస్తీనా మానవ హక్కులపై ఐక్యరాజ్య సమితి దూత వ్యాఖ్యలు

నీవా : ఇజ్రాయిల్, వెస్ట్ బ్యాంక్‌ను పాలస్తీనియన్లకు బహిరంగ జైలుగా మార్చిందని పాలస్తీనా మానవ హక్కులపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత ఫ్రాన్సెకా అల్బనీస్ వ్యాఖ్యానించారు. పాలస్తీనా భూభాగాల్లో గత 56ఏళ్ళుగా ఇజ్రాయిల్ అక్రమణ కొనసాగుతోందని ఆమె పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్‌ఆర్‌సి)లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 1967 నుండి ఆక్రమణ ప్రాంతాల్లో కొనసాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై ఆమె తన నివేదికను సమర్పించారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో స్వేచ్ఛ పూర్తిగా హరించబడిందని,వ్యవస్థాగతమైన వివక్ష పెద్దయెత్తున కొనసాగుతోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమంది పాలస్తీనియన్లు ప్రభావితమవుతున్నారని పేర్కొంది.

జెనీవాలో పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను బాహాటంగా ఉల్లంఘించడమే గాక, జన జీవనంలో చేపట్టే సాధారణ చర్యలను నేరపూరితంగా పరిగణిస్తోందని, పాలస్తీనియన్లను చిత్రహింసలకు గురి చేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రకంగా పాలస్తీనియన్లను బహిరంగ జైల్లో ఉంచినట్టయిందని, అంతకంటే మరే రకంగానూ ఈ వ్యవస్థను నిర్వచించలేమని ఆమె అన్నారు. గత 16ఏళ్ళుగా గాజాలో సాగుతున్న దిగ్బంధనం వల్ల ఆ ప్రాంతమంతా బహిరంగ జైలుగా మారిందని అన్నారు.



ఇటలీలో సమ్మెల హోరు

- ఆగిన రైళ్లు, విమానాలు !

గ్రీస్ : జి-7 గ్రూపులోని ప్రధాన దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్‌ల్లో ఇప్పటికే సమ్మెలతో అట్టుడుకుతుండగా, తాజాగా ఇటలీలోనూ అదే అలజడి మొదలైంది. మెరుగైన రీతిలో వర్క్ కాంట్రాక్టులు, షరతులు రూపొందించాలని కోరుతూ ఇటలీలోని ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు, రైల్వే ఎంప్లాయిస్ యూనియన్లు సమ్మెకు దిగడంతో దేశవ్యాపితంగా వందలాది విమానాలు, రైళ్లు రద్దయ్యాయి. విమానాశ్రయాల్లో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు చిక్కుకుపోయారు. గత రెండు రోజులుగా రైలు సర్వీసులు స్తంభించాయి. పైలట్లు, ఫ్లైట్ అటెండెంట్లు, బ్యాగేజీ హ్యాండ్లర్లు, విమానాశ్రయ సిబ్బంది అందరూ సమ్మెలో పాల్గొన్నారు. ఉదయం 10గంటల నుండి డజన్ల సంఖ్యలో విమానాలు రద్దు చేసినట్లు నాప్లేస్ ఎయిర్‌పోర్ట్ వెబ్‌సైట్ చూపింది. మరోవైపు రైల్వే యూనియన్లు కూడా గురు, శుక్రవారాల్లో రెండు రోజులు సమ్మె నిర్వహించాయి. సిబ్బంది కొరత, అధిక సమయాలు పనిచేయాల్సి రావడం, తక్కువ వేతనాలు, ఇతర పేలవమైన పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ దేశంలోని ప్రధాన రైల్వే యూనియన్లు రెండు రోజుల సమ్మెకు పిలుపిచ్చాయి. దాంతో రైళ్ళు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

ఇటలీలో పర్యాటకులు అత్యధికంగా వచ్చే సమయం ఇది. ఈ పరిస్థితుల్లో రవాణా రంగం స్తంభించడంతో తీవ్ర తలనొప్పిగా మారింది. సాధారణంగా ఇటువంటి సమయాల్లో వెంటనే పరిస్థితులను చక్కదిద్దడానికి యూనియన్ నేతలతో చర్చలు ప్రారంభమవాల్సిన అవసరం వుందని యుఐఎల్ యూనియన్ ఒక ప్రకటనలోపేర్కొంది. రెండు రోజుల సమ్మెను సగానికి తగ్గించాలని ఆదేశిస్తూ రవాణా మంత్రి మాటో సాల్విని డిక్రీపై సంతకం చేశారు. అయితే సర్వీసులను కుదించినప్పటికీ అవి కూడా రద్దు చేయాల్సి వచ్చింది. రైల్వే కార్మికులకు సంతృప్తిని కలగచేసేలా త్వరలో కంపెనీలు, యూనియన్ల మధ్య సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మిలన్ ప్రధాన రైల్వే స్టేషన్‌లో గంట వ్యవధిలో 8రైళ్లు రద్దయ్యాయి.




మీకోసం

గ్యాస్ స్టవ్ కొత్తదానిలా మెరవాలంటే నిమ్మకాయ తొక్కలను ఉడికించి ఆ నీటిలో స్పాంజిని ముంచి తుడవాలి.

జీవన సౌరభం

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

పండు కావాలి!



ధీరజ్ వాళ్ళ నాన్న అశోక్ వస్తూ వస్తూ డజన్ యాపిల్స్ తెచ్చాడు. అవి చూసి ఎంతో సంబరపడిపోయాడు ధీరజ్. చెల్లెలు దివ్యతో కలిసి.. ఓ మూడు రోజులు పాటు ఆనందంగా యాపిల్స్ తినొచ్చు అనుకున్నాడు. కాస్సేపటికి "అత్తయ్యా.. రామారావు గారికి ఆరోగ్యం బాగోలేదని తెలిసింది. వెళ్ళి చూసి వస్తాము. పిల్లలూ.. మీరు కూర్చుని మీ హెూంవర్క్స్ పూర్తి చేసుకోండి" అన్నది ధీరజ్ వాళ్ళమ్మ సరస్వతి.

వాళ్ళు వెళ్తూ వెళ్తూ యాపిల్స్ ఉన్న కవర్ పట్టుకెళ్ళడం చూసీ.. "నానమ్మా .. అదేంటి అమ్మా వాళ్ళు యాపిల్స్ తీసుకెళ్లి పోతున్నారు?" చిన్న బుచ్చుకుంటూ అన్నాడు ధీరజ్.

"ఎవరికైనా ఆరోగ్యం బాగోలేదంటే మిత్రులు, బంధువులు.. ఇలా యాపిల్స్, కమలాలు, కొబ్బరి బొండాలు, బ్రెడ్డు తీసుకెళ్ళి ఇచ్చి పలుకరించి వస్తారురా" అని చెప్పింది భారతమ్మ.

రెండు రోజులయ్యాక.. ఒక ఉదయం ధీరజ్ "అమ్మో కడుపు నెప్పి. అయ్యో జ్వరం.." అంటూ అరవసాగాడు. సరస్వతి కంగారుగా వచ్చి ధీరజ్ నుదుటి పైన చెయ్యివేసి చూసి "జ్వరం లేదు కదా.." అన్నది. వెంటనే ధీరజ్ "అమ్మో కడుపు నెప్పి.." అంటూ మెలికలు తిరగసాగాడు.

"దివ్యా! అన్నయ్యకి కడుపు నెప్పిగా ఉందట. వాడివ్వాళ బడికి రాలేడుగానీ నువ్వు వెళ్ళు" అని దివ్యను బడికి పంపించింది. ఆ మధ్యాహ్నం..

"నీకసలే కడుపు నెప్పిగా ఉంది. నువ్వు వేరే ఏమీ తినకూడదు" అంటూ కొద్దిగా మజ్జిగన్నం పెట్టింది సరస్వతి. ఎవరు ఫోన్ చేసినా "పాపం మా ధీరజ్‌కి కడుపు నెప్పి వచ్చి ఇంట్లోనే పడుకున్నాడు.." అని సరస్వతి ఫోన్‌లో ఇద్దరు ముగ్గురికి చెప్పడం విన్నాడేమో ఉండుండి గుమ్మం వంక చూడసాగాడు.

"ఎవరి కోసం ఎదురు చూస్తున్నావురా?" అని అడిగింది భారతమ్మ.

"నానమ్మా, నాకు ఇంత కడుపు నెప్పి వచ్చి పడుకున్నాను. ఎవరన్నా మిత్రులో బంధువుల్లో పలకరించడానికి వస్తారు కదా! అని చూస్తున్నాను" అన్నాడు ధీరజ్.

"బంధువుల కోసమా.. వాళ్ళు తెచ్చే యాపిల్స్ కోసమా?" అన్నాడు అప్పుడే వచ్చిన అశోక్. "లేదు నాన్నా.. నిజంగా బంధువుల కోసమే చూస్తున్నాను" అన్నాడు గొణుగుతూ..

"ఒరే ధీరజ్ నీకు యాపిల్స్ అంటే ఇష్టమని నాకు తెలుసు.. మీకోసం ఉంచకుండా రామారావు కోసం పండ్లు తీసుకెళ్లిన నాటి నుండీ నీకు వాటి మీదకు ధ్యాస పోయిందని అమ్మ ఫోన్‌లో చెప్పిందిలే. ఇవిగో నీకు ఇష్టమైన యాపిల్స్. కడుక్కుని తిను." అన్నాడు.

"ధీరజ్.. అసలు జబ్బు పడాలి అని ఎవరూ కోరుకోకూడదు. జబ్బు పడ్డాక పండ్లు తినడం కాదు. తరుచూ పండ్లు తింటే జబ్బులు మన దరికి రావు" అన్నది భారతమ్మ.

"ధీరజ్.. నీకు కావాలంటే వారానికి రెండుసార్లు యాపిల్స్ తెస్తాను కానీ, ఇలా అబద్ధాలు చెప్పి బడి మానేయ్యకు. పాఠాలు పోతాయి" అన్నాడు అశోక్.

తాను అబద్ధం చెప్పిన విషయం అమ్మానాన్నలకు అర్థమైనందుకు సిగ్గుపడ్డాడు. తన మనసు తెలుసుకుని కోరిక తీర్చినందుకు సంబరపడ్డాడు. ఇంకెప్పుడూ ఇలా అబద్ధాలు ఆడకూడదని నిర్ణయించుకుని చెల్లికి ఒక పండు కోసి పెట్టి.. తాను ఒక పండు కోసుకుని ఇష్టంగా తినసాగాడు.

- సమ్మెట ఉమాదేవి

నేను గీసిన బొమ్మ





వారధి వరుణ్,
7వ తరగతి,
శ్రీచైతన్య టెక్నో స్కూల్,
అనంతపురం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త సుమా ..!

కొద్ది రోజులుగా రాష్ట్రంలో అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. మరో వైపు ఎండాకాలాన్ని తలపించేలా ఎండలు సైతం కాస్తున్నాయి. ఈ భిన్న పరిణామాలతో ప్రజానీకం వివిధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో కల్తీ ఆహారం, తాగునీరు, మురుగు, దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటమే ఈ వ్యాధుల నియంత్రణకు మార్గం.



వేసవిలో ఎండలతో ఇబ్బంది పడిన ప్రజలు తొలకరి వర్షాలతో ఉపశమనం పొందుతారు. వర్షాకాలం ఎంత ఆహ్లాదాన్నిస్తుందో అంతే ప్రమాదకరం కూడా! వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే.. రోగాలు దాడి చేస్తాయి. మలేరియా, టైఫాయిడ్, కలరా వంటి సీజనల్ వ్యాధులు వేధిస్తాయి. ఈ సీజన్‌లో పిల్లల నుంచి పెద్దల వరకూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై



అవగాహన పెంచుకోవాలి. సాధారణంగా వర్షంలో తడిస్తే చిన్నారులు రొంప, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతుంటారు. వెంటనే వైద్యులను సంప్రదిస్తే సులభంగా తగ్గించుకోవచ్చు.

వ్యాధుల వాహకాలుగా దోమలు

వర్షాలకు విజృంభిస్తున్న దోమలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కాల్వల్లో పేరుకున్న మురుగు, నిల్వనీరు దోమలకు ఆవాసంగా మారతాయి. దోమల కారణంగా మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డెంగ్యూ ఉధృతి కొనసాగుతోంది. విజయవాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ, మచిలీపట్నం నగరాల్లో డెంగ్యూ కేసులు ఏటేటా నమోదవుతున్నాయి. మలేరియా అనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. కుట్టిన దోమలో ప్లాస్మోడియం పరాన్న జీవి ఉంటే మలేరియా వస్తుంది. సకాలంలో చికిత్స తీసుకోకపోతే.. సెరిబ్రల్ మలేరియాకు దారి తీయొచ్చు. ఇది ప్రాణాంతక పరిస్థితి. మూర్ఛలు, మూత్రపిండాల వైఫల్యం, కామెర్లు, శ్వాసకోశ రుగ్మతలకు దారి తీస్తుంది. అధిక తేమ, ఉష్ణోగ్రత మార్పులు ఇన్‌ఫ్లుయెంజా వ్యాప్తికి అనువుగా ఉంటుంది. ఇన్‌ఫ్లుయెంజా ఈ వైరస్ సోకినప్పుడు జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తుమ్ములు, తలనొప్పి, ముక్కు కారడం, అలసట, విరేచనాలు, ఊపిరి సరిగా ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సకాలంలో చికిత్స తీసుకోకపోతే.. న్యుమోనియా, ఉబ్బసం, డయాబెటిస్, గుండె సమస్యలు వంటి దీర్ఘకాలిక పరిస్థితులకు దారితీస్తుంది. కాబట్టి దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి.

వివిధ వ్యాధులు - వాటి లక్షణాలు

మలేరియా : మురుగు లేదా నిల్వ ఉండే నీటిలో ఏర్పడే ఆడ అనోఫెల్స్ దోమ వల్ల ఏర్పడుతుంది.
లక్షణాలు : చలి, జ్వరం, కడుపులో నొప్పి, ఒళ్లు నొప్పులు, అతిగా చెమట పట్టడం
దగ్గు, వైరల్ ఫీవర్ : ఇది అంటు వ్యాధి. ఎక్కువ సేపు వర్షంలో తడిచినా, తడిచిన బట్టల్లో ఉన్నా ఏర్పడుతుంది
లక్షణాలు : గొంతునొప్పి, కండరాల నొప్పులు, ఆయాసం, ముక్కుకారడం
డయేరియా : కలుషిత ఆహారం లేదా నీరు వల్ల వస్తుంది.
లక్షణాలు : ఆయాసం, తిమ్మిరులు, వాంతులు, నీరసం, అలసట
టైఫాయిడ్ : కలుషిత నీరు, లేదా ఆహారం వల్ల వస్తోంది
లక్షణాలు : తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం
లెప్టోస్పిరోసిస్ : శరీరంపై గాయాలున్న వారు మురుగునీటిలో నడిస్తే వస్తుంది.
లక్షణాలు : తలనొప్పి, కళ్ల నొప్పి, శరీరం బిగుతుగా అనిపించటం, జ్వరం
మనం తాగే నీటి ద్వారానే 40 శాతం వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగితే చాలా వరకూ వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి :

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకూడదు
- దోమలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి
- నిండుగా దుస్తులు ధరించాలి
- స్వచ్ఛమైన, ఫిల్టర్ చేసిన, కాచి చల్లార్చిన నీరే తాగాలి.
- రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.
- తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవాలి.
- జనసాంద్రత ఉన్న ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్క్ కచ్చితంగా వాడాలి.



అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ మమత,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
కపిలేశ్వరపురం,
కృష్ణాజిల్లా.

వివిధ సీజన్లలో వచ్చే వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల లార్వా పెరగకుండా మలాథియాన్ స్ప్రే చేయించాలి. ఇళ్లల్లో దోమలు కుట్టకుండా తెరలు వాడాలి. గదులను గాలి, వెలుతురు ఉండే విధంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి.

వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి



డాక్టర్ మైలాబత్తుల గులాబ్‌రాజ్ కుమార్,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
కాళ్ల,
పశ్చిమ గోదావరి జిల్లా.

ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహార పదార్థాలను తినటం మంచిది. స్ట్రీట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. బయట ఆహారం తినటం వల్ల కడుపులో ఇన్ఫెక్షన్ (గ్యాస్ట్రో ఎన్టీరైటిస్) వంటివి వస్తుంటాయి. కడుపులో ఇన్ఫెక్షన్లు కలుగుతాయి. జీర్ణాశయ గోడలు (లైనింగ్), పొట్ట, ప్రేగుల వాపునకు దారితీస్తాయి. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. కాలువల్లో ఆయిల్‌బాల్స్, మలాథీయాన్, బయోటెక్స్ వంటి వాటిని చల్లించాలి. తరచూ బ్లీచింగ్ చల్లించటం మంచిది. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవాలి. రక్షిత మంచినీటినే తాగాలి.

కేరళ మరో ప్రత్యేకత

- చంద్రయాన్-3 విజయవంతంలో 3 కేరళ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర
- ఈ మిషన్‌లో భాగమైనందుకు గర్వంగా ఉంది : కేరళ పరిశ్రమలశాఖ మంత్రి పి రాజీవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

శ్రీహరికోట నుండి చంద్రయాన్-3 విజయవంతం కావడంలో కేరళ తన ప్రత్యేకత చాటుకుంది. కేరళ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్‌యులు) కీలకపాత్ర పోషించాయి. చంద్రుని పై భారతదేశం మూడో మిషన్‌ను పంపడంలో మూడు రాష్ట్ర పిఎస్‌యులు సహాయపడ్డాయి. మిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు కేరళ స్టేట్ ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కెఎస్ఇడిసి)కి చెందిన కెల్ట్రాన్, కేరళ మినరల్స్ అండ్ మెటల్స్ లిమిటెడ్ (కెఎంఎంఎల్), స్టీల్ అండ్ ఇండస్ట్రియల్ ఫోర్జింగ్స్ లిమిటెడ్ (ఎస్ఐఎఫ్ఎల్), తిరువనంతపురం ఆధారిత కోర్టాస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ తయారుచేసిన వివిధ ఉత్పత్తులు ఈ మిషన్‌లో ఉపయోగించారు. 'ప్రపంచం ముందు భారతదేశం సగర్వంగా నిలుస్తోంది. ఈ మిషన్‌లో భాగమైనందుకు కేరళకు కూడా గర్వంగా ఉంది' అని కేరళ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి పి రాజీవ్ అన్నారు. కెల్ట్రాన్ 41 ఎలక్ట్రానిక్ మాడ్యూళ్లను అందించగా, కెఎంఎంఎల్ టైటానియం స్పాంజ్ మెటల్‌ను అందించింది. ఇది క్లిష్టమైన భాగాలను తయారుచేయడానికి ఉపయోగిస్తారు. ఎస్ఐఎఫ్ఎల్ టైటానియం, అల్యూమినియం ఫోర్జింగ్‌లు, ఇతర భాగాలు అందించింది. వెలిలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ప్రాంతంలో ఉన్న ఏరోస్పేస్ తయారీ



సంస్థ కోర్టాస్ ఇండస్ట్రీస్ మిషన్ వివిధ దశల కోసం అనేక విడి భాగాలను అందించింది.

నాలుగు సంస్థలు వివిధ ప్రాజెక్టుల కోసం భాగాలను అందించడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో అనుబంధం కలిగి ఉన్నాయి. అంతరిక్ష ఎలక్ట్రానిక్స్‌లో 30 ఏళ్ల అనుభవం ఉన్న కెల్ట్రాన్, ఈసారి ఉపగ్రహ ప్రయోగ వాహనం ఎల్‌విఎం-3పై ఇంటర్‌ఫేస్ ప్యాకేజీలు, ఏవియానిక్స్ ప్యాకేజీలు, చంద్రయాన్ కోసం పవర్ మాడ్యూల్స్, ఇతర పరీక్ష, మూల్యాంకన మద్దతును అందించింది. అల్లాయ్ ఫోర్జింగ్‌లను రూపొందించడంలో ఎస్ఐఎఫ్ఎల్ నైపుణ్యాన్ని ఇస్రో బాగా ఉపయోగించుకుంది. ఇస్రో నాణ్యతా నియంత్రణ ప్రమాణాల ప్రకారం అసెంబ్లింగ్, ఫ్యాబ్రికేషన్ ప్రక్రియలను నిర్వహించడంతో కెల్ట్రాన్ మిషన్‌లో భాగమైంది.

కరకులంలో కెల్ట్రాన్ ఎక్విప్‌మెంట్ కాంప్లెక్స్, తిరువనంతపురంలోని మన్విలాలోని కెల్ట్రాన్ కమ్యూనికేషన్ కాంప్లెక్స్ ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్నాయి.

'కెల్ట్రాన్ 300లో దాదాపు 50 ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను చాలా ఉపగ్రహ ప్రయోగ ప్రక్రియలో అందిస్తుంది. దీని ద్వారా అంతరిక్ష రంగానికి అవసరమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో కెల్ట్రాన్ కూడా భాగమవుతోంది' అని పిఎస్‌యు ఒక ప్రకటనలో తెలిపింది.

కొల్లంలోని చవరాలో కెఎంఎంఎల్ టైటానియం స్పాంజ్ ప్లాంట్ భారతదేశ వ్యూహాత్మక ప్రయోజనాలకు అనుగుణంగా ఈ ప్లాంట్ 2011లో ప్రారంభించబడింది. అవాంతరాలు ఉన్నప్పటికీ, పిఎస్‌యు చంద్రయాన్-2, చంద్రయాన్-3 రెండింటికీ టైటానియం స్పాంజ్‌ను అందించగలిగింది. 'కెఎంఎంఎల్ మెగ్నీషియంను వేరు చేయడానికి మెగ్నీషియం క్లోరైడ్‌ను రీసైక్లింగ్ చేసే ప్రక్రియలో ఉంది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబొరేటరీతో పాటు, నావికాదళం కూడా ఇప్పుడు మా ఉత్పత్తిపై ఆసక్తిని కనబరిచాయి' అని కెఎంఎంఎల్ అధికారి ఒకరు తెలిపారు.

త్రిసూర్‌కు చెందిన ఎస్ఐఎఫ్ఎల్ ప్రభుత్వ రంగంలో ఏకైక ఫోర్జింగ్ కంపెనీగా తన ప్రత్యేక నైపుణ్యాన్ని ఉపయోగించి విభిన్న ఉత్పత్తులను సరఫరా చేసింది. పిఎస్‌యు దేశీయంగా ఎల్‌విఎం-3, విభజన వ్యవస్థ, వికాస్ ఇంజిన్ (ద్రవ ఇంధన రాకెట్ ఇంజిన్), సిఇ-20 క్రయోజెనిక్ ఇంజిన్ (ఎల్‌విఎం-3 లాంచ్ వెహికల్ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌కి శక్తినివ్వడం) కోసం వివిధ భాగాలను అభివృద్ధి చేసింది. ఇది ఇస్రో మ్యాన్ స్పేస్ మిషన్ అయిన గంగాన్యాన్ కోసం సంక్లిష్టమైన ఫోర్జింగ్‌లకు కూడా దోహదపడుతోంది. కోర్టాస్ ఇండస్ట్రీస్ కూడా పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌విఎంకె-2, ఎల్‌విఎం-3 వంటి లాంచ్ వెహికల్స్, మ్యాన్-స్పేస్ మిషన్ల కోసం అత్యంత క్లిష్టమైన వ్యవస్థలను సరఫరా చేసింది.

తొలి కక్ష్యను పెంచే విన్యాసం విజయవంతం

బెంగళూరు / తిరువనంతపురం : చంద్రయాన్-3 అంతరిక్ష నౌక తొలి కక్ష్యను పెంచే ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించినట్టు ఇస్రో శనివారం తెలిపింది. అంతరిక్ష నౌక ఆరోగ్యం అంతా భేషుగ్గా ఉందని ఇస్రో సోషల్ మీడియా పోస్టులో పేర్కొంది. మలి ఘట్టంలో వ్యోమనౌకలోని థ్రస్టర్లను బెంగళూరులోని ఇస్రో కేంద్రం నుంచి మండించారు. చంద్రయాన్ ఇప్పుడు 73క్ష్మీ41,726 కి.మీ దీర్ఘ వృత్తాకార కక్ష్యలో ఉందని అది తెలిపింది. అన్ని సజావుగా సాగితే 41 రోజులు ప్రయాణం అనంతరం ఆగస్టు 23న చంద్రుడిపై రోవర్ ప్రజ్ఞాన్ పరుగులు తీయనుంది. చంద్రయాన్ 3 వ్యోమనౌక పనితీరు 'మహాద్భుతం'గా ఉందని విక్రమ్ సారాబాయి అంతరిక్ష కేంద్రం (విఎస్ఎస్‌సి) డైరెక్టర్ ఎస్ ఉన్నికృష్ణన్ నాయర్ చెప్పారు. తిరువనంతపురంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రయాన్ 3కి అవసరమైన ముందుస్తు ఏర్పాట్లన్నీ 'అత్యంత కచ్చితత్వం'తో సమకూర్చారని తెలిపారు. 'నేడు (శనివారం) థ్రస్టర్లను మండించాం. చంద్రయాన్ 3 దిగ్విజయంగానే ముందుకు సాగుతోంది. ఆగస్టు 23న చంద్రుడిపై సజావుగానే దిగుతుంది' అని నాయర్ విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి జిల్లా సతీష్ దావన్ అంతరిక్ష కేంద్రం నుంచి దూసుకెళ్లిన ఎల్‌విఎం3 - ఎం4 వ్యోమనౌక చంద్రయాన్3ని 17 నిమిషాల్లోనే లక్షిత కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

'మహారాజు'లా విజయ్ సేతుపతి



హీరోగా, విలన్‌గా విభిన్న పాత్రల్లో తనదైన నటనతో భారతీయ ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు విజయ్ సేతుపతి. ఆయన నటిస్తున్న 50 చిత్రం షూటింగ్ పూర్తయ్యింది. ఈ చిత్రానికి 'మహారాజా' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కురంగు బొమ్మై'చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన నితిలన్ సామినాథన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్యాషన్ స్టూడియోస్, ది రూట్ అండ్ థింక్ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీత బాణీలు అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ దినే శ్ పురుషోత్తమన్.

'కె' అంటే ఒక్క మాటేనా..!




ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో వస్తున్న 'ప్రాజెక్ట్ కే' నుంచి తాజాగా ఓ అప్డేట్ బయటికి వచ్చింది. 'ఈ కవర్‌లో కేవలం ఒక పేపర్ ఒక సింగిల్ వర్డ్‌తో ఉంది. కానీ ప్రపంచమంత బరువు ఈ కవర్‌లో ఉన్నట్టు అనిపిస్తుంది' అంటూ నాగ్ అశ్విన్ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. ఒక్క వర్డ్‌లోనే టైటిల్ ఉంటుందని దర్శకుడు హింట్ ఇచ్చాడంటూ.. ఫ్యాన్స్ భావిస్తున్నారు. దీపికా పదుకొనే, అమితాబ్, దిశా పఠాని, కమల్ హాసన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. విదేశాల్లో జరగనున్న కామిక్ కాన్‌లో పాల్గొనబోతున్న 'ప్రాజెక్ట్ కే' సినిమాకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్ జులై 20న రిలీజ్ చేస్తారని సమాచారం.

మూడ్రోజుల్లోనే ముగించేశారు

- **తిప్పేసిన అశ్విన్**
- **విండీస్‌పై ఇన్నింగ్స్ 141పరుగుల తేడాతో భారత్ గెలుపు**

డొమినిక: తొలిటెస్ట్‌లో భారత ఘన విజయం సాధించింది. శుక్రవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన వెస్టిండీస్ జట్టు సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్(7/71) మాయాజాలానికి 140పరుగులకే కుప్పకూలింది. భారతజట్టు మూడోరోజు తొలి ఇన్నింగ్స్‌ను 5వికెట్ల నష్టానికి 421పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. భారతజట్టులో జైస్వాల్ అత్యధికంగా 171పరుగులు కోహ్లి(76)పరుగులు చేశారు. దీంతో భారతజట్టుకు 217పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు అశ్విన్(7/71), జడేజా(2/38) దెబ్బకు 130పరుగులకే కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు జైస్వాల్‌కు లభించింది. .



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జైస్వాల్

అశ్విన్ ఖాతాలో మరో రికార్డు

టీమిండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ఖాతాలో మరో రికార్డును వేసుకున్నాడు. విండీస్‌తో జరిగిన తొలి టెస్టులో 12 వికెట్లు తీశాడు. దీంతో అశ్విన్ టెస్టుల్లో 10కన్నా ఎక్కువ వికెట్లు తీయడం ఇది ఎనిమిదోసారి. ఇంతకుముందు మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే కూడా 8సార్లు టెస్టుల్లో పదేసి వికెట్లు పడగొట్టాడు. అలాగే టెస్టుల్లో 34సార్లు అయిదేసి వికెట్లు తీసుకున్నాడు. మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 35సార్లుకు చేరువయ్యాడు.. టెస్టుల్లో అయిదేసి వికెట్లు తీసిన జాబితాలో అశ్విన్ ప్రస్తుతం అయిదో స్థానంలో నిలిచాడు. ఇక కరీబియన్ పిచ్‌లపై ఉత్తమ బౌలింగ్ ప్రదర్శించిన రెండో స్పిన్నర్‌గా అశ్విన్ నిలిచాడు. 1973లో పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరిగిన మ్యాచ్‌లో టోనీ గ్రేగ్ 156 రన్స్ ఇచ్చి 13 వికెట్లు తీసుకున్నాడు. అశ్విన్ కన్నా ఇదే బెటర్ రికార్డు.


స్కోర్‌బోర్డు..
వెస్టిండీస్ : 150, 130
భారత్ : 421/5డిక్లేర్డ్

వింబుల్డన్ నయా ఛాంపియన్ వోండ్రుసోవా

టైటిల్ నెగ్గిన తొలి అన్‌సీడెడ్ క్రీడాకారిణి
గాయంతోనే ఫైనల్లో ఓడా: జబీర్


వింబుల్డన్ టైటిల్‌తో వోండ్రుసోవా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను చరిత్రలో తొలిసారి ఓ అన్‌సీడెడ్ క్రీడాకారిణి కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 24ఏళ్ల మార్కెటా వోండ్రుసోవా వరుససెట్లలో 2వ సీడ్ జబీర్‌ను చిత్తు చేసింది. వోండ్రుసోవా 42వ ర్యాంక్ క్రీడాకారిణి. 2017నుంచి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలో దిగుతున్న వోండ్రుసోవా ఏనాడూ 2వ రౌండ్‌ను దాటిన దాఖలాలు లేవు. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 3వ రౌండ్‌లో, ఫ్రెంచ్ ఓపెన్‌లో 2వ రౌండ్‌లోనే నిష్క్రమించిన వోండ్రుసోవా.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఎగరేసుకుపోవడం విశేషం. శనివారం జరిగిన ఏకపక్ష ఫైనల్లో వోండ్రుసోవా 6-4, 6-4తో 2వ ర్యాంక్ క్రీడాకారిణి, ట్యునీషియాకు చెందిన ఆన్స్ జబీర్‌పై వరుససెట్లలో విజయం సాధించింది. ముఖాముఖి పోరులో ఇప్పటివరకు ఇద్దరూ మూడేసిసార్లు విజయం సాధించగా.. టైటిల్ నెగ్గేక్రమంలో వోండ్రుసోవా ఐదుగురు సీడెడ్ క్రీడాకారుణిలపై విజయం సాధించడం విశేషం. రన్నరప్‌గా నిలిచిన జబీర్ మాట్లాడుతూ గాయంతో ఫైనల్ మ్యాచ్ ఆడి ఓడినట్లు పేర్కొంది.


వింబుల్డన్ ఫైనల్లో వరుసగా రెండోసారి ఓటమితో భావోద్వేగానికి గురైన అన్స్ జబీర్(ట్యునీషియా)

వోండ్రుసోవా టైటిల్ సాధించిందిలా..

ఫైనల్	: జబీర్(2)పై 6-4, 6-4(గెలుపు)
సెమీస్	: స్వీటోలినాపై 6-3, 6-3(గెలుపు)
క్వార్టర్స్	: పెగులా(4)పై 6-4, 2-6, 6-4(గెలుపు)
4వ రౌండ్	: బోస్కోవా(33)పై 2-6, 6-4, 6-3(గెలుపు)
3వ రౌండ్	: వేకిక్(20)పై 6-1, 7-5(గెలుపు)
2వ రౌండ్	: కుదెర్మటోవా(12)పై 6-3, 6-3(గెలుపు)
1వ రౌండ్	: స్టైరన్స్‌పై 6-2, 7-5(గెలుపు)

ఇరుజట్లను ఊరిస్తున్న విజయం

దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో విజయం ఇరుజట్లను ఊరిస్తోంది. సౌత్ జోన్ నిర్దేశించిన 298 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్ట్ జోన్‌జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 62.3 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసింది. వెస్ట్‌జోన్ విజయానికి వెస్ట్‌జోన్ జట్టు మరో 116 పరుగులు చేయాల్సి ఉండగా.. సౌత్‌జోన్ మరో ఐదు వికెట్లు కూలిస్తే టైటిల్‌ను ముద్దాడనుంది.

సెమీస్‌కు లక్ష్యసేన్

యుఎస్ ఓపెన్ సూపర్-300

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 21-10 21-17తో భారత్‌కే చెందిన 19ఏళ్ల ఎస్.శంకర్ ముత్తుస్వామిని ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్ పివి సింధు 20-22, 13-21తో గావో ఫాంగ్ జీ చేతిలో ఓటమి పాలైంది.

లాంగ్‌జంప్‌లో శ్రీశంకర్‌కు రజితం

పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు

బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ లాంగ్‌జంప్ విభాగంలో మురళీ శ్రీశంకర్ రజత పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ సాధించాడు. శనివారం జరిగిన లాంగ్ జంప్ ఫైనల్లో శ్రీశంకర్ 8.37మీటర్ల దూకి రెండో స్థానంలో నిలిచాడు. మొదటి ప్రయత్నంలో 8.10 మీటర్ల దూరం దూకిన శ్రీశంకర్.. మూడో ప్రయత్నంలో 8.12మీటర్లు, ఐదో ప్రయత్నంలో 8.37మీటర్లతో రికార్డు నమోదు చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68